# అగ్రనేత

తెలుగు దిన పత్రిక


TELTEL/2015/66279

రంగారెడ్డి సంపుటి: 10 సంచిక :253 ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ తేది: గురువారం 18-12-2025 పేజీలు:4 వెల: 2.00


## అటవీ భూములను ఆక్రమించిన కొండగట్టు

జగిత్యాల,జగిత్యాల జిల్లాలో ఉన్న సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం, కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం ప్రస్తుతం అటవీ శాఖ, దేవాదాయ శాఖ మధ్య కీలక వివాదానికి కేంద్రంగా మారింది. అటవీ శాఖ అధికారులు ఆలయ నిర్వహణ కమిటీకి నేరుగా షోకాజ్ నోటీసులు జారీ చేయడంతో, భక్తులలో మరియు స్థానికులలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. అటవీ శాఖ అధికారులు జారీ చేసిన నోటీసులలో, ఆలయ నిర్వహణ కమిటీ 684 బ్లాక్ అటవీశాఖ పరిధిలోని దాదాపు 6 ఎకరాల అటవీ భూమిని ఆక్రమించారని స్పష్టంగా ఆరోపించారు. ఈ ఆక్రమణ భూమిలో అక్రమ నిర్మాణాలు జరిగాయని, ఇది అటవీ సంరక్షణ చట్టాలను ఉల్లంఘించడమేనని అధికారులు పేర్కొన్నారు. ముఖ్యంగా, ఈ ఆరు ఎకరాల విస్తీర్ణంలోనే అన్నదాన సత్రం, వాటర్ ఎలాంట్, వాహన పూజ షెడ్, ఎగ్జిక్యూటివ్ బిల్డింగ్, సాగర్ గెస్ట్ హౌస్, పబ్లిక్ టాయిలెట్స్ వంటి ఆలయానికి సంబంధించిన ముఖ్యమైన కట్టడాలు ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంలో అటవీ శాఖ ఫారెస్ట్ కన్సర్వేషన్ యాక్ట్ కింద నోటీసులు జారీ చేసింది. అటవీ భూమిలో నాన్-ఫారెస్ట్ పనులు చేపట్టడానికి కన్సర్వేషన్ యాక్ట్ 2౦ ప్రకారం కేంద్ర అటవీ శాఖ అనుమతులు తప్పనిసరి అని

## సిడ్నీ మారణహోమం.. భాగ్యనగరానికి 'ఉగ్ర' మచ్చ?



హైదరాబాద్,ప్రపంచ పటంలో ఐటీ హబ్‌గా, విశ్వనగరంగా వెలుగొందుతున్న హైదరాబాద్ కీర్తికి మరోసారి మచ్చ పడింది. ఆస్ట్రేలియాలోని సిడ్నీలో 11 మంది అమాయకుల ప్రాణాలను బలిగొన్న పాశవిక కాల్పుల ఘటన మూలాలు భాగ్యనగరంలో బయటపడటం ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైంది. బాండీ బీచ్ వద్ద జరిగిన నరమేధానికి ప్రధాన సూత్రధారి అయిన సాజిద్ అక్రమ్ హైదరాబాద్ నుంచి వెళ్లినవాడేనని, అతడి వద్ద భారత పాస్‌పోర్ట్ ఉందని ఆస్ట్రేలియా అధికారులు ధృవీకరించడంతో భారత నిఘా వర్గాలు ఉలిక్కిపడ్డాయి.ఆస్ట్రేలియా అధికారులు అందించిన సమాచారం ప్రకారం.. సాజిద్ అక్రమ్ 1998లో స్టూడెంట్ వీసాపై హైదరాబాద్ నుంచి ఆస్ట్రేలియా వెళ్లాడు. అక్కడే ఒక విదేశీయురాలిని వివాహం చేసుకుని స్థిరపడ్డాడు. ఈ కాల్పుల్లో సాజిద్‌తో పాటు అతని కుమారుడు నవీద్ కూడా పాల్గొన్నాడు. నవీద్ ఆస్ట్రేలియాలోనే పుట్టి పెరిగినప్పటికీ, తండ్రి ద్వారా సంక్రమించిన తీవ్రవాద భావజాలం అతడిని కూడా హంతకుడిగా మార్చింది. గడిచిన 25 ఏళ్లలో సాజిద్ కేవలం రెండుసార్లు మాత్రమే హైదరాబాద్‌కు వచ్చాడని, చివరిసారిగా 2022లో వచ్చి వెళ్లినట్లు రికార్డులు చెబుతున్నాయి. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు పోలీసులు సాజిద్ కుటుంబ సభ్యులు, బంధువుల వివరాలపై ఆరా తీస్తున్నారు.

ఈ ఘటన కేవలం ఒక వ్యక్తికి సంబంధించినదిగా చూడలేం. గత రెండు దశాబ్దాలుగా ప్రపంచంలో ఎక్కడ ఉగ్రవాద కార్యకలాపాలు జరిగినా, ఏదో ఒక మూల హైదరాబాద్ లింక్ బయటపడుతుండటం ఆందోళన కలిగించే అంశం. గతంలో మక్కా మసీదు పేలుళ్లు, దిల్?సుఖ్?నగర్ బాంబు దాడుల నుండి మొదలుకొని.. ఇటీవల ఐసిస్ రిక్రూట్‌మెంట్ల వరకు హైదరాబాద్ పేరు వినిపిస్తూనే ఉంది. ఇప్పుడు నేరుగా ఆస్ట్రేలియాలో జరిగిన దాడిలో నిందితుడు హైదరాబాద్ పాస్‌పోర్ట్ కలిగి ఉండటం, ఇక్కడి నుంచి వెళ్లిన వాడే కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

అమెరికన్ రాజకీయాలు

పోలీసులు, ఇంటెలిజెన్స్ బ్యూరో , ఎన్ఐఏ వంటి సంస్థలు ఎప్పటికప్పుడు ఉగ్రవాద సానుభూతిపరులను అరెస్టు చేస్తున్నా, ఈ నెట్‌వర్క్‌ను పూర్తిగా తుడిచిపెట్టలేకపోతున్నాయా? అనే ప్రశ్న తలెత్తుతోంది. కలుపు మొక్కను పైపైన కత్తిరిస్తున్నారే తప్ప, వేర్లతో సహా పెకిలించలేకపోతున్నారు అనడానికి తాజా ఘటనే నిదర్శనం. సాజిద్ 2022లో హైదరాబాద్ వచ్చినప్పుడు నిఘా వర్గాల కంటపడకుండా ఎలా ఉండగలిగాడు? ఇక్కడ అతనికి సహకరించిన స్లీపర్ సెల్స్ ఏమైనా ఉన్నాయా? అనే కోణంలో ఇప్పుడు లోతైన దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉంది. భాగ్యనగరంలో ఉగ్రవాద భావజాలం ఒక అంతర్లీన ప్రవాహంలా కొనసాగుతోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.భారతదేశం ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రపంచ వేదికలపై గళం విప్పుతున్న తరుణంలో, భారత పాస్‌పోర్ట్ కలిగిన వ్యక్తి విదేశాల్లో మారణకాండ సృష్టించడం దేశ ప్రతిష్టను దిగజార్చే అంశం. ముఖ్యంగా గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్ వంటి దిగ్గజ సంస్థలకు నెలవైన హైదరాబాద్.. ఇలాంటి వార్తలతో 'టెర్రర్ హబ్'గా ముద్రపడే ప్రమాదం ఉంది. ఇది అంతర్జాతీయ పెట్టుబడులపై, పర్యాటకంపై, విదేశాల్లో నివసించే సాధారణ హైదరాబాదీల భద్రతపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. విదేశాలకు వెళ్లే భారతీయ విద్యార్థులు, ఉద్యోగులను ఇకపై అనుమానపు చూపులతో చూసే పరిస్థితిని ఇలాంటి ఘటనలు కల్పిస్తాయి.సిడ్నీ ఘటన ఒక హెచ్చరిక మాత్రమే. హైదరాబాద్‌ను కేవలం భౌగోళికంగా అభివృద్ధి చేస్తే సరిపోదు, సామాజికంగా కూడా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది. ఉగ్రవాద భావజాలాన్ని నరనరాన ఎక్కించుకున్న వారిని, వారికి ఆశ్రయం కల్పిస్తున్న వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలి. కేవలం ఘటన జరిగినప్పుడు హడావిడి చేయడం కాకుండా, నిరంతర నిఘా, కఠినమైన చర్యలతో ఈ ఉగ్ర మచ్చను చెరిపివేయాలి. లేదంటే, "బ్రాండ్ హైదరాబాద్" భవిష్యత్తు ప్రశ్నార్థకమయ్యే ప్రమాదం ఉంది. దీనికి ఇప్పుడే, ఇక్కడే ఫుల్ స్టాప్ పెట్టాలి.

## రాష్ట్రంలో వక్స్ భూముల రక్షణపై ప్రత్యేక దృష్టి

హైదరాబాద్ : తెలంగాణలో వక్స్ భూముల పరిరక్షణపై తమ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్ స్పష్టం చేశారు. భూముల వివరాలను డిజిటలైజ్ చేసేందుకు ప్రత్యేకంగా 'ఉమ్మీద్ పోర్టల్' ఏర్పాటు చేస్తున్నామని, అయితే గత 10 రోజులుగా సాంకేతిక సమస్యలు తలెత్తాయని తెలిపారు.

మంగళవారం సచివాలయంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో కలిసి మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వివరాలను వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 63,180 ఎకరాలు వక్స్ ఆస్తులు ఉండగా, ఇప్పటివరకు కేవలం 16,700 ఎకరాల వివ రాలను మాత్రమే పోర్టల్లో నమోదు చేశారని మంత్రి వెల్లడించారు. ఇంకా 46 వేల ఎకరాలకు పైగా భూముల వివరాలు నమోదు కావాల్సి ఉందన్నారు.తప్పుడు పత్రాలతో భూములను అప్లోడ్ చేస్తే వాటిని తిరస్కరిస్తామని హెచ్చరించారు. పోర్టల్లో సాంకేతిక సమస్యలు, యాప్ సరిగా పనిచేయకపోవడం వల్ల భూముల నమోదుకు మరింత సమయం ఇవ్వాలని కోరుతూ ప్రధాన మంత్రికి, కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసినట్లు వివరించారు. ఇటీవల గురుకులాల్లో జరిగిన ఫుడ్ పాయిజనింగ్ ఘటనలను



మంత్రి దురదృష్టకరమని అభివర్ణిం చారు. ఈ ఘటనలపై విచారణకు ఆదేశించామని, నిరక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై ఇప్పటికే చర్యలు తీసుకున్నామని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా. విద్యార్థులకు భోజనం అందించడానికి 30 నిమిషాల ముందే అధికారులు, సిబ్బంది పర్యవేక్షి చాలని ఆదేశాలు జారీ చేశామన్నారు.

## ట్రంప్ మరో కీలక నిర్ణయం..



వాషింగ్టన్,వలసలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉక్కుపాదం మోపుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే యూఎస్‌లో అక్రమంగా నివసిస్తున్న విదేశీయులను బహిష్కరించారు. అంతేకాదు, వలసలపై కఠిన నిర్ణయాలు అమల్లోకి తెచ్చారు. ఈ క్రమంలోనే తాజాగా ట్రంప్ యంత్రాంగం మరో కీలక నిర్ణయం తీసుకుంది. జాతీయ, ప్రజా భద్రతను సాకుగా చూపుతూ మరికొన్ని దేశాలపై ట్రావెల్ బ్యాన్ విధించారు. ఏడు దేశాలపై నిషేధం, మరో 15 దేశాలపై ప్రవేశ ఆంక్షలు విధించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులపై ట్రంప్ మంగళవారం సంతకం చేశారు. తాజా నిర్ణయంతో అమెరికాలో ప్రవేశానికి నిషేధం ఉన్న దేశాల సంఖ్య 39కి పెరిగింది.తాజా ఉత్తర్వుల ప్రకారం.. ఐదు దేశాల పౌరులపై అమెరికా పూర్తి స్థాయి నిషేధాన్ని విధించింది. ఇందులో బుర్కినా ఫాసో, మాలి, నైజర్, దక్షిణ సూడాన్, సిరియాలు ఉన్నాయి. వీటితో పాటు పాలస్తీనియన్ అథారిటీ జారీ చేసిన ప్రయాణ పత్రాలు ఉన్నవారు అమెరికాకు వలస రాకుండా పూర్తి నిషేధం విధించారు. గతంలో పాక్షిక ఆంక్షలు ఉన్న లావోస్, సియెర్రా లియోన్ దేశాలను కూడా ఇప్పుడు పూర్తి నిషేధిత జాబితాలోకి మార్చారు. పాక్షిక ఆంక్షలు విధించిన దేశాల జాబితాలో.. అంగోలా, ఆంటిగ్వా & బార్బుడా, బెనిన్, ఐవరీ కోస్ట్, డొమినికా, గాబన్, గాంబియా, మలావి, మౌరిటేనియా, నైజీరియా, సెనెగల్, టాంజానియా, టోంగా, జాంబియా, జింబాబ్వే ఉన్నాయి.ఈ కొత్త నిబంధనలు జనవరి 1 నుంచి అమలులోకి రానున్నాయి. ఇక ఇప్పటికే అమెరికా ప్రభుత్వం 12 దేశాలపై ట్రావెల్ బ్యాన్ విధించిన విషయం తెలిసిందే. అఫ్ఘానిస్థాన్, బర్మా, చాడ్, రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఈక్వటోరియల్ గినియా, ఎరిట్రియా, హైతీ, ఇరాన్, లిబియా, సోమాలియా, సుడాన్, యెమెన్ దేశాలపై నిషేధం విధించింది. ఈ ఆంక్షల నుంచి ఇప్పటికే వీసాలు ఉన్నవారు, అమెరికా గ్రీన్ కార్డ్ హోల్డర్లు, దౌత్యవేత్తలు, క్రీడాకారులు, అమెరికా ప్రయోజనాలకు అవసరమని భావించే వ్యక్తులకు మినహాయింపు ఉంటుంది.

## పరకామణి చోరీ పై హైకోర్టు సంచలన వ్యాఖ్యలు

అమరావతి,వైసీపీ పాలనా కాలంలో తిరుమల శ్రీవారి పరకామణిలో 900 డాలర్ల చోరీ జరిగిన విషయం తెలిసిందే. ఈ పరిణామం తిరుమల భక్తులపై తీవ్ర ప్రభావం కూడా చూపించింది. వీటి విలువ 70 వేలు. అయితే.. ఈ కేసులో రాజీ చేసుకోవడంతోపాటు.. ఫిర్యాదు చేసిన అప్పటి టీటీడీ భద్రతా సిబ్బంది.. సీఐ.. సతీష్ కుమార్.. అనుమానాస్పద రీతిలో మృతి చెందారు.మొత్తంగా ఈ కేసు విచారణ కొనసాగుతోంది. తాజాగా ఏపీ హైకోర్టు ఈ కేసుపై కీలక వ్యాఖ్యలు చేసింది. దీనిని కేవలం దొంగతనంగా చూడకూడదని వ్యాఖ్యానించింది. ఇది అతి పెద్ద నేరమని, కోట్ల మంది భక్తుల విశ్వాసానికి, శ్రీవారి ఆలయ నగదు భద్రతకు సంబంధించిన ప్రశ్నలని పేర్కొంది. దీనిని తేలికగా తీసుకుంటే.. భక్తుల విశ్వాసానికి గండి కొట్టినట్టే అవుతుందని తెలిపింది. ఈ నేపథ్యంలో నిందుతుల విషయాన్ని లైట్‌గా తీసుకునేందుకు కోర్టు సిద్ధంగా లేదని స్పష్టం చేసింది.ఈ కేసు విచారణను నిష్పక్షపాతంగా నిర్వహించాలని సీఐడీ అధికారులకు కోర్టు స్పష్టం చేసింది. అదే సమయంలో పరకామణి కానుకల లెక్కిపు వ్యవహారంపై ప్రస్తుతం అనుసరిస్తున్న విధానాన్ని తమకు చెప్పాలని టీటీడీని ఆదేశించింది. అదేవిధంగా భక్తులకు కూడా ఈ విషయంలో అవకాశం కల్పించాలని.. మరింత పకడ్బందీగా లెక్కింపు నిర్వహించాలని కూడా కోర్టు ఆదేశించింది. ప్రతి విషయానికీ టీటీడీ బాధ్యత వహించాల్సి ఉంటుందని, కోట్ల మంది భక్తుల మనోభావాలను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది.ముఖ్యంగా ఔట్ సోర్సింగ్(వేరే ఉద్యోగం చేసుకుంటూ.. పార్ట్‌టైమ్‌గా




పనిచేసేవారు) ఉద్యోగులను ఈ విధులకు నియమించే విషయంపై పునరాలోచన చేయాలని సూచించింది. అదేవిధంగా శ్రీవారిపై అచంచల భక్తిని చాటుకునే వారికి కూడా పరకామణి కానుకల లెక్కింపులో చోటు కల్పించాలని హైకోర్టు ఆదేశించింది. అదేవిధంగా ఏఐ వినియోగాన్ని పెంచాలని సూచించింది.ఇక కోర్టు వ్యాఖ్యలు చూసిన నెటిజన్లు మాజీ సీఎం వైఎస్ జగన్ చేసిన 'చిన్న చోరీ' వ్యాఖ్యలను మరోసారి తప్పుబడుతున్నారు. శ్రీవారి పవిత్ర సన్నిధిలో జరిగిన చోరీ చిన్నదైనా పెద్దదైనా అది ఆలయ ప్రతిష్ఠకు భంగం కలిగించినట్టే అవుతుందని, ఈ విషయంలో కోర్టు కూడా జగన్ మరియు జగన్ ను వెంకేసుకొస్తున్న వైసీపీ నాయకులకు మొట్టికాయ వేసినట్టయిందని విశ్లేషకులు చెబుతున్నారు.

## తీవ్ర కాలుష్యం నేపథ్యంలో ఢిల్లీ ప్రభుత్వం కీలక ఆదేశాలు

న్యూఢిల్లీ,దేశ రాజధాని ఢిల్లీ కాలుష్య కోరల్లో చిక్కుకుని అల్లాడిపోతోంది. శీతాకాలం కావడంతో ఢిల్లీలో వాయు కాలుష్య సంక్షోభం తలెత్తింది. గత కొన్ని రోజులుగా వాయు కాలుష్యం ప్రమాదకరస్థాయిలో నమోదవుతోంది. ఏక్యూఐ లెవెల్స్ 400కిపైనే నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు పలు ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కాలుష్య కట్టడికి ప్రభుత్వం కఠిన నిబంధనలు అమలు చేస్తోంది. ఇప్పటికే పలు ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. నగరంలోని అన్ని సంస్థలకు 50శాతం వర్క్ ఫ్రమ్ హోమ్ ను తప్పనిసరి చేసింది.ఢిల్లీ ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. నగరంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు తప్పనిసరిగా 50 శాతం వర్క్ ఫ్రమ్ హోమ్ పద్ధతిలో పనిచేయాలని ఆదేశించింది. ఈ ఆదేశాలను ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధిస్తామని కూడా హెచ్చరించింది. అంతేకాదు, కాలుష్య నిరోధక ఆంక్షల కారణంగా పని కోల్పోయిన రిజిస్టర్డ్ నిర్మాణ కార్మికులకు రూ. 10,000 పరిహారం అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.రాజధాని ఢిల్లీలో కాలుష్యం కట్టడిపై అక్కడి ట్రిపుల్ ఇంజిన్ సర్కారు చేతులెత్తేసింది. రోజురోజుకూ దిగజారుతున్న కాలుష్య ప్రమాణాలపై బీజేపీ మంత్రి మంజీందర్ సింగ్



మంగళవారం ప్రజలకు క్షమాపణ చెప్పారు. కాలుష్య కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమేనని అంగీకరించిన ఆయన, ఆ తప్పునకు మాత్రం మునుపటి ఆప్ ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. కేవలం 9,10 నెలల్లో కాలుష్య స్థాయిని తగ్గించడం సాధ్యం కాదన్నారు. ఢిల్లీలో కాలుష్యం నేపథ్యంలో ఇక నుంచి పొల్యూషన్ అండర్ కంట్రోల్ సర్టిఫికెట్ ని చూపిన వాహనదారులకే ఇంధనం నింపాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## కాంగ్రెస్ నాయకులు పోలీసుల అండతో దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు



శివ్వంపేట,డిసెంబర్ 17 : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులకు అనుకూలంగా పోలీసులు వ్యవహరిస్తూ బీఆర్ఎస్ మద్దతుదారుల సర్పంచ్ అభ్యర్థులు, కార్యకర్తలను భయభ్రాంతులకు గురి చేశారని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. బుధవారం స్థానిక ఎన్నికల సందర్భంగా స్వగ్రామమైన మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గోమారం గ్రామంలో తన కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు పోలీసుల అండతో దౌర్జన్యాలకు పాల్పడుతూ ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నారని మండిపడ్డారు.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండు సంవత్సరాలలో ఏ ఒక్క అభివృద్ధి పని చేయకపోగా.. గ్రామాల్లో ఓటర్లను మద్దతుదారులను లక్ష్యంగా చేసుకుని తమకు ఓటు వేయకపోతే సంక్షేమ పథకాలు నిలిపివేస్తామని కాంగ్రెస్ నాయకులు బెదిరింపులకు దిగుతున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇది ఎన్నికల నియమావళికి విరుద్ధమైన చర్యగా ఆమె విమర్శించారు. పోలీసులు గత రెండు మూడు రోజులుగా వ్యవహరిస్తున్న తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే, మండలంలోని బిజిలిపూర్ గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్త ఇంట్లోకి చొరబడి కొట్టడం అమానుషమని అన్నారు.అలాగే కొల్చారం మండలం రంగంపేట గ్రామంలో బీఆర్ఎస్ మాజీ జడ్పిటిసి ఇంట్లో లిక్కర్ అమ్ముతున్నారంటూ హడావుడి చేయడం రాజకీయ కక్షతో చేసిన చర్యగా ఆరోపించారు. నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి గ్రామంలో నిన్న రాత్రి పోలీసుల పహారాలోనే డబ్బులు తీసుకువచ్చి లైట్లు ఆపేసి కాంగ్రెస్ నాయకులు డబ్బులు పంపిణీ చేశారని ఎమ్మెల్యే తీవ్రంగా మండిపడ్డారు. ఇలాంటి అక్రమాలకు పోలీసులు మౌనసాక్షిగా ఉండటం ప్రజాస్వామ్యానికి మచ్చగా పేర్కొన్నారు.ఈ ఘటనలపై వెంటనే ఉన్నతాధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో కలిసి రోడ్డెక్కి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు మెజారిటీ స్థానాలను కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్ర గౌడ్, బీఆర్ఎస్ నాయకులు సంతోష్ రెడ్డి, కుంట లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

## సింగరేణి సిఎండిగా కృష్ణ భాస్కర్

హైదరాబాద్,సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఐఏఎస్ అధికారి కృష్ణ భాస్కర్‌ను నియమించారు. ప్రస్తుతం టీజీ జెన్‌కో సీఎండీగా పనిచేస్తూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రత్యేక కార్యదర్శిగా కొనసాగుతున్న 2012 ఐఏఎస్ అధికారి కృష్ణ భాస్కర్ ను తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు సింగరేణి ఇన్‌చార్జి చైర్మన్‌గా కొనసాగించనున్నారు. ప్రస్తుతం సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ గా కొనసాగుతున్న బలరాం పదవీకాలం ముగియడంతో ఆయన స్థానంలో కృష్ణ భాస్కర్ ను నియమించారు.

## బీహార్ మంత్రి వివాదాస్పద వ్యాఖ్యలపై అగ్నికి ఆజ్యం



పాట్నా:బీహార్ సీఎం నితీష్ కుమార్ చేసిన నిర్ణయం ఒక మహిళా డాక్టర్ హిజాబ్‌ను తొలగించడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. హిజాబ్, జాతీయ మరియు రాష్ట్ర వ్యాప్తంగా మహిళా హక్కుల ప్రాతినిధ్యంగా, మాధ్యమాల్లో, సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలకు కారణమైంది.ఈ సందర్భంలో యూపీ మంత్రి సంజయ్ నిషాద్ హిజాబ్ ఘటనను సమర్థిస్తూ చేసిన వ్యాఖ్యలు మళ్లీ తీవ్ర విమర్శలకు దారితీస్తున్నాయి. ఆయన వ్యాఖ్యలను ప్రజల్లో వివాదాస్పదంగా భావిస్తూ, రాజకీయ వర్గాలు, మహిళా సంఘాలు, సామాజిక సంస్థలు తీవ్ర స్పందన చూపుతున్నాయి.

ప్రతిపక్షాలు, మహిళా సంఘాల ప్రతిక్రియ

ప్రతిపక్ష పార్టీలు, మహిళా సంఘాలు, సివిల్ సొసైటీ ప్రతినిధులు మంత్రి వ్యాఖ్యలను అసభ్యకరంగా, అప్రమత్తత తప్పనిసరిగా చూపించాల్సిన రాజకీయ బాధ్యతను అవమానించేలా ఉన్నాయని విమర్శిస్తున్నారు. దీనివల్ల సమాజంలో తీరని విభజనలు, వాదవివాదాలు మరింత పెరిగే ప్రమాదముందని వారు హెచ్చరిస్తున్నారు.సంజయ్ నిషాద్ తన వ్యాఖ్యలను కేవలం స్థానిక భోజ్పురి యాసలో క్యాజువల్‌గా చెప్పానని, ఎవరినీ అవమానించాలనే ఉద్దేశ్యం లేదని వివరణ ఇచ్చారు. అయినప్పటికీ, ఈ వివరణను ప్రతిపక్షాలు మరియు సామాజిక వర్గాలు తట్టుకోలేదు.

రాజకీయ పరిణామాలు

ఈ వివాదం బీహార్ రాష్ట్రంలో రాజకీయ ఉత్కంఠను పెంచుతోంది. రాజకీయ వర్గాలు, హక్కుల సంఘాలు, మీడియా వర్గాలు ప్రతి చర్యపై తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. నితీష్ కుమార్ చర్యను మద్దతిచ్చేవారూ, వ్యతిరేకించేవారూ సమాజంలో వివాదానికి మిగిలారు.

## నిజామాబాద్ జిల్లాలో కాల్పుల కలకలం

నిజామాబాద్,నిజామాబాద్ జిల్లా ఇందల్‌వాయి మండలంలోని దేవీతండా వద్ద కాల్పులు కలకలం రేపాయి. ఈ ఘటనలో ఒకరు మృతి చెందారు. మహమ్మద్ సల్మాన్ (48) అనే వ్యక్తి తన లారీని 44వ జాతీయ రహదారి పక్కన పెట్రోల్ బంక్‌లో నిలిపి ఉంచారు. మరో లారీలో వచ్చిన ముగ్గురు దుండగులు.. నిలిపి ఉంచిన లారీలో ఉన్న సల్మాన్‌ను తుపాకీతో కాల్చి పరారయ్యారు.

## సంపాదకీయం

**గురువారం 18-12-2025**

# రాజధాని విన్యాసాలు

రాజధాని అమరావతి విషయంలో పదకొండేళ్లుగా కేంద్రంలో పాలన వెలగబెడుతున్న మోడీ ప్రభుత్వం కప్పగంతుల వైఖరి తీసుకోవడం రాజకీయ దివాళాకోరుతనమే! తాజాగా అమరావతికి చట్టబద్ధత కల్పనపై తీవ్ర గందరగోళం సృష్టించి రాష్ట్ర ప్రజలను, రాజధాని కోసం భూములిచ్చిన రైతులను అయోమయంలోకి నెట్టి చోద్యం చూడటం క్షమించరానిది. రాజధాని విస్తరణకు రెండవ దశ ల్యాండ్ పూలింగ్‌నకు టిడిపి కూటమి ప్రభుత్వం వడివడిగా అడుగులేస్తుండగా, అమరావతే రాష్ట్ర రాజధానిగా చట్టబద్ధత కల్పించాలని పదేళ్ల క్రితం భూములిచ్చిన రైతుల నుంచి డిమాండ్ బలంగా ముందుకొచ్చింది. భవిష్యత్తులో ప్రభుత్వం మారితే తమ గతేమిటన్న నిలదీతలను కూటమి నేతలు ఎదుర్కొంటున్నారు. సమస్య నుంచి బయటపడటానికి చట్టబద్ధతను తెరమీదికి తెచ్చారు. న్యాయశాఖ అమోదంతో సహా చట్టబద్ధత బిల్లునకు అన్ని చర్యలూ కేంద్రంలో స్పీడుగా సాగుతున్నాయని, ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే బిల్లు వస్తుందని కూటమి అనుకూల మీడియా విస్తృత ప్రచారం లంకించుకోగా, రాష్ట్ర సర్కార్ ఆ ప్రతిపాదనను లీగల్ బూచితో కేంద్రం తిప్పిపంపిందని వ్యతిరేక మీడియా కౌంటర్ ప్రచారం ఎత్తుకుంది. ఈ సమావేశాల్లో బిల్లు రాదన్న కబురు కేంద్ర మంత్రి పెమ్మసాని చల్లగా చెప్పారు. యుపిఎ-2 ప్రభుత్వం పార్లమెంట్‌లో తెచ్చిన ఎ.పి. పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని బిజెపి రెండు చేతులా ఆహ్వానించడంతోపాటు ఢిల్లీని తలదన్నే రాజధానిని నిర్మిస్తామని హామీ ఇచ్చింది. 2015 దసరా రోజున ప్రధాని మోడీ అమరావతికి శంకుస్థాపన చేశారు. అప్పుడు ఎన్‌డిఎ ప్రభుత్వంలో టిడిపి భాగస్వామిగా ఉంది. రాజధాని నిర్మాణానికి రూ.2 లక్షల కోట్లు కావాలని రిపోర్టులు పంపగా కేంద్రం రూ.1,500 కోట్లు విదిల్చింది. 2019లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వైసిపి మూడు రాజధానుల ఆటతో గందరగోళం సృష్టించగా, కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం నిలువరించకపోగా, రాజధాని అంశం తమ పరిధిలో లేదని, రాష్ట్రం ఇష్టమని న్యాయస్థానాల్లో అఫిడవిట్లు ఇచ్చి అయోమయానికి ఆజ్యం పోసింది. మోడీ శంకుస్థాపన చేసిన విషయాన్ని కూడా మర్చిపోయి మూడు కాకపోతే ముప్పై పెట్టుకోమని బిజెపి పెద్దలు గేలిచేసి రాష్ట్ర ప్రజలకు ద్రోహం తలపెట్టారు. మరలా 2024 ఎన్నికల్లో టిడిపిని అక్కున చేర్చుకొని కేపిటల్ గేమ్ ఆడుతున్నారు. రెండవ తడవ ప్రధాని అమరావతి పనులకు శంకుస్థాపన సమయంలో రాజధాని రైతులు చట్టబద్ధతపై పట్టుబట్టగా సభా వేదిక నుంచి ప్రధానితో ఆ విషయాన్ని చెప్పిస్తామని కూటమి పెద్దలు హామీ ఇచ్చినా అది జరగలేదు. దాంతో అమరావతి కథకు ముగింపు లేకుండా పోయింది. అమరావతికి టిడిపి సర్కార్ తొలుత 33 వేల ఎకరాలను సమీకరించింది. భూములిచ్చిన రైతులకు హామీ ఇచ్చిన మేరకు ఇప్పటి వరకు అభివృద్ధి పర్చిన ప్లాట్లు ఇవ్వలేదు. ప్రభుత్వం మారిన ఐదేళ్లల్లో వారి పరిస్థితి అగమ్యగోచరమైంది. వ్యవహారం ఒక కొలిక్కి రాకముందే, మరోసారి 20 వేల ఎకరాల సమీకరణకు సర్కార్ నోటిఫికేషన్ ఇచ్చేసింది. మరో 20 వేల ఎకరాలంటోంది. భుములివ్వకపోతే అమరావతి మున్సిపాలిటీగా మిగులుతుందని ముఖ్యమంత్రి అన్నట్లు వార్తలు గుప్పుమన్నాయి. ప్రభుత్వ పెద్దల బెదిరింపులు రైతుల్లో మరింత గుబులు రేపుతున్నాయి. అటు కేంద్ర ప్రభుత్వమేమో చట్ట ప్రకారం రాజధానికి బడ్జెట్ నుంచి నిధులివ్వకుండా అప్పులు చేయమంటోంది. స్వయం పోషక రాజధానని చెప్పిన టిడిపి రుణాల బాట పట్టింది. ఈ పూర్వరంగంలో చట్టబద్ధత కల్పిస్తేనే తమకు నమ్మకం కుదురుతుందన్న రైతుల డిమాండ్ సహేతుకమైనది. అమరావతికి రెండుసార్లు ప్రధాని శంకుస్థాపన చేశారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవలనే అమరావతిలో కేంద్ర ప్రభుత్వ సంస్థల, బ్యాంక్ స్ట్రీట్ నిర్మాణాలకు భూమి పూజ చేశారు. అటువంటి అమరావతికి చట్టబద్ధత కల్పనకు కేంద్రానికి ఏం ఇబ్బందొచ్చిందో అంతుబట్టదు. కేంద్రం తమ ప్రతిపాదనకు కొర్రీలేసి తిరస్కరించినా టిడిపి-జనసేన ఎందుకు మోడీ ప్రభుత్వంపై ఒత్తిడి చేయట్లేదో తెలీదు. అమరావతిపై వీళ్ల విన్యాసాలు ఇంకెన్నేళ్లు రాష్ట్ర ప్రజలు భరించాలి? నాలుగు పార్టీల తొండాటపై ఇకనైనా రాజధాని రైతులు, యావత్ రాష్ట్ర ప్రజానీకం అప్రమత్తం కావాల్సిన సమయం ఆసన్నమైంది.

# ట్రంప్ ఆగ్రహాన్ని లెక్కచేయని దోస్తీ..

న్యూఢిల్లీ,రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత్ పర్యటన విశేషమైంది. ఇది ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత పుతిన్ మొట్టమొదటి భారత సందర్శన. ఈ కలయిక రెండు దేశాల మధ్య చరిత్రాత్మక స్నేహాన్ని మరోసారి రుజువు చేసింది. అయితే ఈ సన్నిహితత్వం పశ్చిమ దేశాలకు, ముఖ్యంగా డోనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని అమెరికాకు నచ్చటం లేదు.

చిరకాల బాంధవ్యం.. చెరగని స్నేహం

భారత్-రష్యా సంబంధాలు ఎప్పుడూ ప్రత్యేకమే. ఈ సమ్మిట్‌లో భారతదేశ అవసరాలకు రక్షణ, ఇంధనం, వాణిజ్యం, పటిష్టతలపై పదహారు కీలక ఒప్పందాలు రష్యాతో కుదుర్చుకొన్నాం. భారత్ ఇప్పటికీ తన రక్షణ ఆయుధాల్లో 60 శాతానికి పైగా రష్యా నుండే కొంటోంది. (ఎస్-400 )వ్యవస్థ తర్వాత మరిన్ని ఆధునిక ఆయుధ ఒప్పందాలు ఖరారయ్యాయి. ఇక ఈ ఒప్పందాల్లో అతి ముఖ్యమైనది ఇంధన రంగం. యుద్ధం తర్వాత భారత్ రష్యా నుండి భారీగా డిస్కౌంట్ ధరకు క్రూడాయిల్‌ను కొనుగోలు చేసింది. 2022లో 10 బిలియన్ డాలర్లున్న వాణిజ్యం 2024-25 నాటికి 68 బిలియన్ డాలర్లకు చేరింది. ప్రతి బ్యారెల్‌కు సగటున 12 డాలర్ల ఆదా అవుతోంది. పుతిన్ 'భారతదేశ అవసరాలకు సరిపడా ఆంక్షలు లేని ఇంధనం సరఫరా'కు హామీ ఇచ్చారు. రెండు దేశాలూ 2030 నాటికి 100 బిలియన్ డాలర్ల వాణిజ్యాన్ని లక్ష్యంగా పెట్టుకున్నాయి.

భారత్-రష్యా... డీ-డాలరేజేషన్ బంధం

డాలర్‌ను దాటవేసి రూపాయి-రూబుల్ లావాదేవీలు, రష్యన్ బ్యాంకులు భారత స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు. ఇవన్నీ డీ-డాలరైజేషన్ దిశగా వేగంగా వేస్తున్న చిన్న అడుగులు.. గ్లోబలైజేషన్ నియమాల ప్రకారం ఎవరు ఎవరితోనైనా అంతర్జాతీయ మార్కెట్లో ఎగుమతులు, దిగుమతులు వాళ్ల దేశ అవసరాలకు అనుగుణంగా స్వేచ్ఛగా చేసుకోవచ్చు. ఇప్పుడు భారత్‌కు రష్యా ఇచ్చే ధరకు ఏ దేశం క్రూడాయిల్ సరఫరా చేసినా కొనుగోలుకు భారత్ సిద్ధంగా ఉంది. కానీ, రష్యాతో ఈ సన్నిహితత్వం అమెరికాకు కంటగింపుగా మారింది. కానీ భారత్ తన జాతీయ ప్రయోజనాలకు అడ్డు రాకుండా స్వతంత్ర విదేశాంగ విధానాన్ని కొనసాగిస్తోంది.



రష్యా చమురు కొనుగోలు ఆగదు..

ట్రంప్ తన దేశాన్ని బలోపేతం చేసుకోవటం తప్పు కానప్పుడు... అదే మార్గంలో భారత్ అనుసరిస్తే తప్పేముంది? భారత్ రష్యా నుండి ఆయిల్ కొనుగోళ్లను పూర్తిగా ఆపే అవకాశం ఏమాత్రం లేదు. ఎందుకంటే ఇంధన భద్రత, దేశంలో ధరల స్థిరత్వం కీలకం. అమెరికా నుండి కొంత ఆయిల్ కొంటూ రష్యాతోనూ సంబంధాలు కాపాడుకుంటుంది. రక్షణ ఒప్పందాలు కూడా కొనసాగుతాయి. ఎందుకంటే భారత సైన్యానికి రష్యన్ ఆయుధాల స్పేర్ పార్ట్స్, సాంకేతికత అత్యవసరం. అమెరికాతో క్వాడ్, ఐ2, యూ2 వంటి వేదికల ద్వారా సహకారం పెరుగుతూనే ఉంటుంది. రష్యా-చైనా దోస్తీ భారత్‌కు పూర్తిగా వ్యతిరేకం కాదు. బదులుగా రష్యా ఒక బ్యాలెన్సింగ్ శక్తిగా పనిచేస్తుంది.

నూతన భారత్ తలవంచదు..

అంతిమంగా పుతిన్ ఢిల్లీ సందర్శన ఒక స్పష్టమైన సందేశం ఇచ్చింది. భారత్ ఎవరి ఒత్తిడికీ లొంగని స్వతంత్ర శక్తిగా ఎదుగుతోంది. గ్లోబల్ ఆర్డర్ మారుతోంది. బ్రిక్స్, షాంఘై కో-ఆపరేషన్ వంటి వేదికల్లో భారత్-రష్యా భాగస్వామ్యం మరింత బలపడనుంది. ఈ దోస్తీ భారత్ జాతీయ ప్రయోజనాలకు అనుకూలంగా ఉంటూనే, ప్రపంచ రాజకీయాల్లో దాని స్వరాన్ని మరింత బలంగా వినిపిస్తుంది. ట్రంప్ గానీ, యూరప్ గానీ, ఈ కొత్త భారత్‌ను గౌరవించక తప్పదు. ఒక దేశం మెరమెచ్చుల కోసం మన విధానాలు మారవు.

# ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీ బాబు ఆలోచన

విశాఖపట్నం,అమరావతి, విశాఖ ప్రపంచానికే కేంద్రంగా తయారవుతుందని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. సీఎం చంద్రబాబు ఆలోచనలు నుంచి పుట్టినది ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీ అని చెప్పుకొచ్చారు. మరికొద్ది నెలలో భోగాపురం ఎయిర్పోర్ట్ ప్రారంభమవుతుందని.. మరో నెలలో ట్రయల్ రన్ నిర్వహిస్తామని వెల్లడించారు. ప్రస్తుతం ఏవియేషన్ బాగా ప్రాచుర్యం పొందుతోందన్నారు. మనదేశంలో ఏవియేషన్ అభివృద్ధి చెందుతుందంటే ఈ ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందని తెలిపారు. ప్రతి ఏటా 12 శాతం గ్రోత్ రేట్‌తో ఏవియేషన్ రంగం ఎదుగుతోందన్నారు. సాధారణ వ్యక్తి విమానంలో ప్రయాణం చేసే స్థాయికి భారతదేశం ఎదిగిందని తెలిపారు. భవిష్యత్‌లో ఎయిర్ క్రాఫ్ట్ సంఖ్య ఎనిమిది వేలకు పెరిగే అవకాశం ఉందని అన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీ ఏర్పాటు అవుతుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఏవియేషన్ విశ్వవిద్యాలయాలకు జీఎంఆర్ - మాన్సాస్ ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీ కేంద్రంగా ఉంటుందని కేంద్రమంత్రి చెప్పారు. ఏవియేషన్ రంగంలో శిక్షణ కోసం ఇతర ప్రాంతాల నుంచి ఉత్తరాంధ్రకు వస్తారన్నారు. ఉత్తరాంధ్రలో పూసపాటి కుటుంబం ఉండడం అందరి అదృష్టమన్నారు. కోట్ల విలువచేసే భూమిని పూసపాటి కుటుంబం విద్యకు ఇస్తున్నారని తెలిపారు. ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీకి 136 ఎకరాల భూమిని ఇచ్చారని అన్నారు. భవిష్యత్ తరాలకు ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. విమానయాన రంగంలో ట్రైనింగ్ కెపాసిటీ ఇంకా పెరగాల్సి ఉందని.. దీనికి జీఎంఆర్ - మాన్సాస్ ఏవియేషన్ ఎడ్యుసిటీ ఉపయోగపడుతుందని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని వచ్చే నెలలో ట్రయల్ రన్

# నేతలది తలోదారి.. చర్చలు పెడదారి



న్యూఢిల్లీ,డేటా లోపభూయిష్టంగా ఉన్నప్పుడు, విధానాలు తప్పుదారి పట్టే ప్రమాదం ఉంది. పెంచిన వృద్ధి రేటు డేటా, గణాంకాలు ఆర్థిక పరమైన కష్టాలను తెచ్చి పెడతాయి. సామాజిక రంగా లలో పెట్టుబడి తగ్గించేందుకు ఇక్కట్లలో ఉన్న సమాజాలనుంచి మద్దతు తగ్గేందుకు తోడ్పడే రిస్క్ కూడా ఉంది. అసంఘటిత రంగంలో కోల్పోయిన ఉపాధి అవకాశాలను తక్కువగా లెక్కించినట్లయితే, ఉపాధి కల్పన పథకాలు సరిపోవు. పేదరికం అంచనాలను వక్రీకరిస్తే, ఆకలి బాధలను తీర్చి, పౌష్టికాహార లోపం సవరించే పథకాలు బలహీనపడగలవు. ఈ కోణంలో డేటా లేదా తప్పుడు సమాచారం ఇవ్వడమే, అది సమాజానికే హానికరంగా పనిచేస్తుంది. అయినా, ఈ ఆందోళనలను పారదర్శకంగా ఎదుర్కొనేందుకు బదులు, ప్రస్తుత రాజకీయ వ్యవస్థ తరచు దీనిని తిరస్కరిస్తూ, డేటా తారుమారు చేసేందుకే సిద్ధపడుతోంది. బిజెపి ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో వాస్తవాలు వేరేగా చిత్రీకరిస్తున్నా, ఆర్థిక వ్యవస్థ నిరంతరంగా స్పష్టమైన చిత్రాన్ని చూపేందుకు ప్రయత్నిస్తోంది. భారతదేశ ఆర్థిక పునాదులను పటిష్టం చేసేందుకు దిద్దుబాటు చర్యలు చేపట్టాల్సిన సమయంలో పార్లమెంటు రాజకీయాలు, సైద్ధాంతిక నాటకాలలో మునిగిపోయినట్లు కన్పిస్తున్నది. రాజ్యాంగ విలువల చర్చ కాకుండా జాతీయ గీతం వందేమాతరంపై చర్చ అనుమానాలకు తావు ఇస్తోంది. 150 ఏళ్ల గీతంపై చారిత్రక వివరణ భావోద్వేగాలపై చట్టసభ సభ్యులు చర్చిస్తుండగా, ఇదే సమయంలో జరిగిన పరిణామాలను పట్టించుకోలేదు. అంతర్జాతీయ ద్రవ్యనిధి భారతదేశానికి, దాని జాతీయ ఖాతాల డేటా నాణ్యతకు సి గ్రేడ్ కేటాయించింది. పార్లమెంటు చర్చలలో మునిగి ఉండగా ప్రపంచ ఆర్థిక సంస్థ అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం ఆర్థిక డేటా విశ్వసనీయతను ప్రశ్నిస్తున్నది. ఇది దేశ ఆర్థికపరమైన ప్రాధాన్యతలు, పాలన, జవాబుదారీతనం క్షీణించడాన్ని తేటతెల్లం చేస్తున్నది. హిందూత్వ సైద్ధాంతిక చట్రానికి అనుగుణంగా చరిత్రను ఎలా పునర్నిర్వచిస్తున్నారో వందేమాతరం చర్చే వెల్లడిస్తున్నది. చరిత్రను సంక్లిష్టమైన వివాదాస్పదంగా, రాజ్యాంగపరమైన సున్నితత్వాలకు అనుగుణంగా వ్యవహరించడానికి బదులు, చట్ట సభ్యులు పవిత్రమైన కథనాన్ని విధించేందుకు ప్రయత్నించారు. ఒకప్పటి పరిణామాలపై అసమ్మతిని నమ్మకద్రోహంగా చిత్రీకరించడం యాదృచ్ఛికం కాదు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ఆరోగ్యం, విద్య, పర్యావరణ పతనం, వాయు కాలుష్యం, ఆర్థిక పాలన వంటి పౌరుల జీవితాలను నిజంగా ప్రభావితం చేసే అంశాలపై చర్చను అడ్డుకోవడం కోసమే, ఈ చర్చ లేవదీశారు. అమూల్యమైన, పరిమితమైన పార్లమెంటరీ సమయం, సమకాలీన సమస్యలను పరిష్కరించదు. ప్రజాస్వామ్య చర్చలకు అవకాశం ఇవ్వడం లేదు. భారతదేశ డేటా వ్యవస్థలపై ఐఎంఎఫ్ అంచనాలతో పోల్చినప్పుడు ఈ చర్చలను తప్పుదోవ పట్టించే ధోరణి ఇబ్బందికరంగా మారుతుంది. భారత జాతీయ ఖాతాల గణాంకాలకు ఐఎంఎఫ్ -సి- గ్రేడ్ ఇవ్వడం అన్నది కేవలం సాంకేతిక ఫుట్ నోట్ కాదు. ఇది ఆర్థిక వాస్తవికతను ఎలా కొలుస్తారు. ఎలా అర్థం చేసుకుని వ్యాఖ్యానిస్తారనే దానికి స్పష్టమైన నేరారోపణ. ప్రొణబ్ సేన్, అరుణ్ కుమార్ వంటి ఆర్థికవేత్తలు ఎత్తి చూసినట్లుగా, వ్యవసాయాన్ని మినహాయించిన తర్వాత, జిడిపిలో దాదాపు 30 శాతం ఉండే అసంఘటిత రంగాన్ని అంచనా వేయడానికి భారత వ్యవస్థీకృత రంగ ప్రతినిధులు ప్రధానంగా ఆధారపడడం ఆందోళన కలిగించే విషయం. ఈ పద్ధతి స్వల్పకాలంలో స్థిరమైన వృద్ధికి పనిచేసి ఉండవచ్చు. కానీ నిర్మాణాత్మక ఇబ్బందుల సమయంలో ఇది దెబ్బతీస్తుంది. భారతదేశం వరుసగా ఇలాంటి సమస్యలను చాలా ఎదుర్కొంది. నోట్ల రద్దు, జిఎస్‌టి అమలు, కొవిడ్ -19 మహమ్మారి వ్యవస్థీకృత, అసంఘటిత రంగాల మధ్య సంబంధాలపై పెద్ద ప్రభావమే చూపాయి. పెద్ద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు త్వరగానే కోలుకున్నాయి. విస్తరించాయి కూడా. కానీ, అసంఘటిత రంగం, చిన్న వ్యాపారులు, కార్మికులు, సూక్ష్మ, చిన్న తరహా సంస్థలు దీర్ఘకాలిక ఇబ్బందులను ఎదుర్కొన్నాయి. ఈ క్లిష్ట సమయంలో రెండు రంగాలు కలిసి కదిలాయని భావించడం తప్పుకాదు. ఇది క్రమపద్ధతిలో ఆర్థిక వ్యవస్థ పనితీరును సుస్పష్టం చేస్తుంది. అటువంటి అంచనాల నేపథ్యంలో వెల్లడైన వృద్ధిరేటు కాగితంపై ఆకట్టుకునేలా కన్పించవచ్చు. కానీ లోతైన ఆర్థిక లోపాలను కప్పివేస్తాయి. నమ్మదగని డేటా వల్ల తలెత్తే ఇబ్బందులు విద్యాపరమైన చర్చకు మించి ఉంటాయి. విధాన నిర్ణయాలు తీసుకోవడానికి, బడ్జెట్‌లను కేటాయించేందుకు, సంక్షేమ పథకాల రూపకల్పనకు, అభివృద్ధి ప్రాధాన్యతలను నిర్ణయించడానికి ఆర్థిక డేటా యే ఆధారం. డేటా లోపభూయిష్టంగా ఉన్నప్పుడు, విధానాలు తప్పుదారి పట్టే ప్రమాదం ఉంది. పెంచిన వృద్ధి రేటు డేటా, గణాంకాలు ఆర్థిక పరమైన కష్టాలను తెచ్చి పెడతాయి. సామాజిక రంగాలలో పెట్టుబడి తగ్గించేందుకు ఇక్కట్లలో ఉన్న సమాజాలనుంచి మద్దతు తగ్గేందుకు తోడ్పడే రిస్క్ కూడా ఉంది. అసంఘటిత రంగంలో కోల్పోయిన ఉపాధి అవకాశాలను తక్కువగా లెక్కించినట్లయితే, ఉపాధి కల్పన పథకాలు సరిపోవు. పేదరికం అంచనాలను వక్రీకరిస్తే, ఆకలి బాధలను తీర్చి, పౌష్టికాహార లోపం సవరించే పథకాలు బలహీనపడగలవు. ఈ కోణంలో డేటా లేదా తప్పుడు సమాచారం ఇవ్వడమే, అది సమాజానికే హానికరంగా పనిచేస్తుంది. అయినా, ఈ ఆందోళనలను పారదర్శకంగా ఎదుర్కొనేందుకు బదులు, ప్రస్తుత రాజకీయ వ్యవస్థ తరచు దీనిని తిరస్కరిస్తూ, డేటా తారుమారు చేసేందుకే సిద్ధపడుతోంది. బిజెపి ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో వాస్తవాలు వేరేగా చిత్రీకరిస్తున్నా, ఆర్థిక వ్యవస్థ నిరంతరంగా స్పష్టమైన చిత్రాన్ని చూపేందుకు ప్రయత్నిస్తోంది. జిడిపి గణన పద్ధతుల్లో మార్పులు, వినియోగం, ఉపాధి డేటా విడుదల చేయడంలో విపరీతమైన జాప్యం, ఇబ్బందికరమైన సర్వే ఫలితాలు వస్తే, వాటిని అణచివేయడం లేదా దాచివేయడం, స్వతంత్ర, స్పష్టమైన అభిప్రాయాలను పక్కన పెట్టడం ఇవన్నీ అపనమ్మకాన్ని పెంచేందుకు దోహదపడుతున్నాయి. ఒకప్పుడు స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థలు, జాతీయ గణాంకాల కమిషన్ వంటి వాటిలో రాజీనామాలు పెరిగిపోవడం, మార్జినలైజేషన్‌ల వల్ల ప్రజల విశ్వసనీయత తగ్గింది. మీడియాలో ఒక ముఖ్యమైన వర్గం ఈ సమస్యను మరింత జటిలం చేసింది. ముఖ్యమైన మినహాయింపులతో పాటు, ప్రధాన స్రవంతి మీడియాలోని పెద్ద విభాగాలు ఐఎంఎఫ్ ఆందోళనలను విస్మరించాయి. లేదా ఆవశ్యకతను తొలగించి లోపలి పేజీలకు కుదించాయి. డేటా నాణ్యత, పద్ధతి సమగ్రత, విధాన పరిణామాలను విశ్లేషించే టెలివిజన్ చర్చలకు బదులు, సైద్ధాంతిక పరమైన వాదనలు, పక్షపాత చర్చలకు వీలు కల్పిస్తున్నారు.

# టిమ్స్ హాస్పిటల్స్ పనుల్లో వేగం పెంచాలి

హైదరాబాద్,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు,రోడ్లు భవనాలు శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి సూచనల మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ సోమవారం అల్వాల్ టిమ్స్ హాస్పిటల్ నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ ప్రాంగణం కలియతిరిగిన స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్ ఇంజనీర్లను,వర్క్ ఏజెన్సీని పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బి అధికారులకు,నిర్మాణ సంస్థకు పలు కీలక ఆదేశాలు జారీచేశారు. రాష్ట్ర ప్రభుత్వం టిమ్స్ హాస్పిటల్స్ నిర్మాణం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని,త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కృత నిశ్చయంతో ఉందని అన్నారు. అల్వాల్ టిమ్స్ హాస్పిటల్ 12,14,060 చదరపు అడుగుల విస్తీర్ణంలో సుమారు 1196 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్నామని, ముఖ్యమంత్రి ఆర్ అండ్ బి శాఖ మంత్రి రెగ్యులర్ గా నిర్మాణ పురోగతిపై మానిటరింగ్ చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికే పూర్తి నాణ్యతతో స్ట్రక్చరల్ వర్క్ పూర్తయిందని,95శాతం బ్రిక్ వర్క్, ప్లాస్టరింగ్ పూర్తయిందని, 60శాతం , ఫ్లోరింగ్, పెయింటింగ్ వర్క్స్ 50శాతం మేర పూర్తయి వేగంగా పనులు జరుగుతున్నాయని అన్నారు. మొత్తంగా టిమ్స్ అల్వాల్ పనులు 70శాతం శాతం పూర్తయ్యాయని చెప్పారు. 2026 మార్చి చివరి నాటికి అన్ని రకాల పనులు పూర్తయి,ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆర్ అండ్ బి ఇంజనీర్లను, వర్క్ ఏజెన్సీని స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్ ఆదేశించారు. ఆరోగ్య శాఖ అధికారులను సమన్వయం చేసుకుంటూ పనులు పూర్తి చేయాలని అన్నారు. రెగ్యులర్ గా ఫీల్డ్ విజిట్ చేస్తానని అందరూ అలెర్ట్ గా పనిచేస్తూ..ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేందుకు కృషి చేయాలని అన్నారు. ఆయన వెంట ఆర్ అండ్ బి సి.ఈ లు రాజేశ్వర్ రెడ్డి,లింగారెడ్డి,పలువురు ఈ.ఈ, డి.ఈ లు ఫీల్డ్ ఇంజనీర్లు,ఆఇఅ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్స్ నిర్మాణ సంస్థ ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

# కన్హా శాంతివనం సందర్శించిన చంద్రబాబు

రంగారెడ్డి, ఆధ్యాత్మికత ద్వారానే విశ్వ చైతన్యం సాధ్యమవుతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. సోమవారం హైదరాబాద్ శివారులోని కన్హా శాంతి వన ఆశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా కన్హా శాంతి వనం నిర్వాహకులు, శ్రీరామ చంద్ర మిషన్ ప్రెసిడెంట్ దాజీతో సమావేశమయ్యారు. శాంతివనంలో ప్రపంచంలోనే అతిపెద్ద ధ్యాన కేంద్రం ఉంది. అలాగే వెల్‌నెస్ సెంటర్, యోగా చేసుకునేందుకు సౌకర్యం, హార్ట్‌ఫుల్‌నెస్ ఇంటర్నేషనల్ స్కూల్, పుల్లెల గోపీచంద్ స్టేడియం వంటివి ఉన్నాయి. వీటిని దాజీతో కలిసి సీఎం చంద్రబాబు సందర్శించారు. కన్హా శాంతి వనం స్వర్గాన్ని తలపించేలా ఉందని, పర్యావరణాన్ని కాపాడుతూ శాంతి వనాన్ని తీర్చిదిద్దిన తీరు అద్భుతమని వ్యాఖ్యానించారు. రేపటి తరం నాయకులను తీర్చిదిద్దేలా హార్ట్‌ఫుల్‌నెస్ ఇంటర్నేషనల్ స్కూల్ నడుపుతున్నారని సీఎం ప్రశంసించారు. అలాగే శాంతివనంలో జరుగుతోన్న శాస్త్రీయ, వృక్షశాస్త్ర పరిశోధనల గురించి ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. శాంతి వనంలో చేపడుతున్న జీవ వైవిధ్యం, పర్యావరణ కార్యక్రమాలను వీక్షిస్తూ సీఎం చంద్రబాబు రెయిన్‌ఫారెస్ట్‌ను సందర్శించారు. రెయిన్ ఫారెస్ట్ రూపకల్పన, దానికి ఉన్న ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను సీఎంకు దాజీ వివరించారు. అలాగే ధ్యాన మందిరం వెలుపల ఉన్న వర్షపు నీటి సంరక్షణ ప్రాంతమైన బాబూజీ వనాన్ని సీఎం సందర్శించారు. హార్ట్‌ఫుల్‌నెస్ గోపీచంద్ ఇంటర్నేషనల్ ట్రైనింగ్ అకాడమీని, ప్రపంచ స్థాయి శిక్షణా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..కన్హా శాంతి వనంలో ఆధ్యాత్మికత ఉట్టిపడే వాతావరణం ఉందన్నారు. విద్యా రంగంలో కొత్త ప్రమాణాలు పాటిస్తూ హార్ట్‌ఫుల్‌నెస్ ఇంటర్నేషనల్ స్కూల్ చేపడుతున్న కార్యక్రమాలు బాగున్నాయన్నారు. ఏపీ ముఖ్యమంత్రి శాంతివనాన్ని సందర్శించడం సంతోషాన్నిస్తోందని శ్రీరామ చంద్ర మిషన్ ప్రెసిడెంట్ దాజీ అన్నారు. అలాగే విద్య, ఆరోగ్య సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ వంటి రంగాల్లో సేవలను అందిస్తున్నామని దాజీ తెలిపారు.

# తిరుమల తరహాలో అన్ని ఆలయాల్లో యూపిఐ పేమెంట్లు

తిరుమల,దేశవ్యాప్తంగా ఉన్న 60 టీటీడీ ఆలయాల్లో భక్తులు సులభతరంగా యూపీఐ పేమెంట్లు చేసేందుకు వీలుగా కియోస్క్ మిషన్లు, క్యూఆర్ కోడ్స్ ఏర్పాటు చేయాలని అధికారులను టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో గల ఆయన కార్యాలయంలో సోమవారం ఉదయం సీనియర్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతాల్లో టీటీడీ నిర్మించదలచిన ఐదువేల ఆలయాలకు గాను అవసరమైన రెండు, మూడు డిజైన్లు సిద్ధం చేయాలని సీఈని ఆదేశించారు. తద్వారా ఆయా ప్రాంతాల్లో ఆలయాల నిర్మాణ ప్రక్రియ వేగవంతమవుతుందని తెలిపారు. తిరుపతిలోని వినాయక నగర్ వద్ద ఉన్న టీటీడీ స్టాఫ్ క్వార్టర్స్ ఆధునీకరణ పనులను త్వరితగతిన చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని చీఫ్ ఇంజనీర్ ను ఆదేశించారు. ఆ ప్రాంతంలో సీసీ కెమెరాల ఏర్పాటు పనులను కూడా వేగవంతం చేయాలన్నారు. అదేవిధంగా కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లుల విషయంలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలన్నారు. అప్పలాయగుంట ఆలయం వద్ద భక్తులకు సమాచారం తెలిసేలా సమాచార సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. శ్రీవారి ఆలయం లో ఉన్న కదిలే వంతెన మరమ్మతు పనులను వైకుంఠ ఏకాదశిలోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముంబైలోని బాంద్రా ఆలయంలో జేఈవో, చీఫ్ ఇంజనీర్,సంబంధిత అధికారులతో క్షేత్రస్థాయి పరిశీలన చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానికాలయాలకు నియమించిన ప్రత్యేక అధికారులు ఆయా ఆలయాల అభివృద్ధికి సంబంధిత అధికారుల తో సమన్వయం చేసుకుని సత్వర చర్యలు చేపట్టాల్సిందిగా ఆదేశించారు. తిరుమల తరహాలో తిరుచానూరు, తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో కూడా టీటీడీ అందిస్తున్న సేవలపై భక్తుల నుండి అభిప్రాయ సేకరణ చేయాలని చెప్పారు. కర్ణాటకలోని బెలగావి లో ఆలయం నిర్మాణం, బీహార్ లోని పాట్నాలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయింపుపై ఆయా అధికారులతో సంప్రదించి ఆలయాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. ధార్మిక ప్రచురణలకు సంబంధించి ఇదివరకే ముద్రించిన పుస్తకాల పంపిణీ విషయంలో తగు సూచనలు చేసేందుకు నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా టీటీడీ ప్రచురణల్లో బాగా డిమాండ్ ఉన్న పుస్తకాలను పాఠకుల అభిరుచి మేరకు పునర్ ముద్రణకు తగు చర్యలు తీసుకోవాలని ఆయన జేఈవోకు సూచించారు. ఈ సమావేశంలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, సీవీ/ఎస్వో మురళీకృష్ణ, ఎఫ్ఏ/సీఏఓ బాలాజీ, సీఈ సత్యనారాయణ, డిప్యూటీ సీఎఫ్ ఫణి కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఆరోగ్య వ్యవస్థలో మార్పులకు యత్నం

అమరావతి,రాష్ట్ర ఆరోగ్య వ్యవస్థలో మార్పు తీసుకురావడం జరుగుతుందని మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. 10 వ్యాధులను మ్యాపింగ్ చేసి ఎక్స్‌పర్ట్స్ ఆలోచనలకు అనుగుణంగా ట్రీట్‌మెంట్ చేయటం జరుగుతుందని వెల్లడించారు. జాతీయ, అంతర్జాతీయ ఎక్స్‌పర్ట్స్‌తో ఉండే శాస్త్రవేత్తలు ఈ గ్రూప్‌లో ఉన్నారని తెలిపారు. దేశ విదేశాలలో ఉన్న ఈ సైంటిస్ట్‌లు వర్చువల్ విధానంలో మొదటి సమావేశానికి హాజరయ్యారన్నారు. వ్యక్తిగత చికిత్స అందించేందుకు ప్రతిష్టాత్మకంగా ఈ ఎక్స్‌పర్ట్స్ గ్రూప్ పనిచేస్తుందని అన్నారు. ఆరోగ్య వ్యవస్థని పటిష్టత చేసే యోచనలో ముందుకి వెళ్తున్నామని వెల్లడించారు. రాబోయే రోజుల్లో ఫీల్డ్ విజిట్ చేయటం జరుగుతుందని మంత్రి తెలిపారు. ఇక.. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణపై మంత్రి స్పందించారు. కోటి సంతకాల రాద్ధాంతం మొదలైందని.. ఇది కోడి గీతల కార్యక్రమం అంటూ ఎద్దేవా చేశారు. సుపరిపాలన యాత్రలో ఎవరు కూడా కోటి సంతకాల కార్యక్రమంలో పాల్గొనలేదని తెలియజేశారు. లక్షల మందిలో కనీసం ఒక్కరు కూడా సంతకం చేసిన దాఖలు లేవన్నారు. గ్రామ, పట్టణ, కళాశాలలో కానీ పేదలలో ఎలాంటి చర్చ లేదన్నారు. కార్యకర్తలకు సంతకాలు పెట్టి చేతులు వాసిపోతున్నాయని ఆ పార్టీ కార్యకర్తలే చెబుతున్నారని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఇూగా.. ఈరోజు సచివాలయంలో వైద్య ఆరోగ్య శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. అత్యున్నత స్థాయి నిపుణుల సలహా బృందంతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం మాట్లాడారు. ఈ సమీక్షలో మంత్రి సత్యకుమార్ యాదవ్, వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు, గేట్స్ ఫౌండేషన్ కంట్రీ డైరెక్టర్ అర్చనా వ్యాస్ తదితరులు పాల్గొన్నారు.

# హలో టీ బీజేపీ లీడర్స్…

న్యూఢిల్లీ,అరె… ఏమైంద్ర బై మీకు? మొన్నటిదాకా దోస్తానా బాగుండేది కదా…గిపుడు ఈ లొల్లేంటి? సోషల్ మీడియాలో వారేంటి? గిట్లయితే సానా కష్టమని ఎర్రజేసుకుండ్రి జర. .అంటూ ఆ పార్టీ అగ్రనాయకత్వం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. 2028 లక్ష్యంగా పనిచేయాల్సిందిగా ఓ వైపు ప్రధాని నరేంద్ర మోదీ ఎంపీలకు క్లాసులు పీకుతుంటే…ఇక్కడ తెలంగాణలో మాత్రం నేతలు తమకు నచ్చినట్టుగా చేస్తున్నారు. తెలంగాణలో బీజేపీ నేతల అంతర్గత కుమ్ములాటలు పార్టీకి ప్రమాదకరంగా మారుతున్నాయని వారు వ్యక్తం చేస్తున్నారు. గత ఎన్నికల్లో రెండు తెలుగు రాష్ట్రాలతో పోల్చుకుంటే…తెలంగాణలో బీజేపీ చెప్పుకోదగ్గ ఫలితాలనే రాబట్టింది. ఏపీతో పోలిస్తే తెలంగాణలో బీజేపీకి పొలిటికల్ బేస్ బాగానే ఉంది. కానీ అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్టు తయారైంది పార్టీ పరిస్థితి. గత అసెంబ్లీ ఎంపీ ఎన్నికల్లో బీజేపీ ఓటుశాతం చాలా పెరిగింది. దీన్ని మరింత పెంచుకోవల్సింది పోయి…స్థానిక నేతలు వారిలో వారు చిన్నపిల్లల్లా కుమ్ములాడుకుంటున్నారు.తెలంగాణ బీజేపీలో అంతర్యుద్ధం పతాక స్థాయికి చేరుకుంటోంది. నేతలు వాదులాడుకోవడం…కుమ్ములాడుకోవడం దాటి సోషల్ మీడియా వేదిక చేసుకునని ఒకరిపైఒకరు బురద చల్లుకుంటున్నారు. ఈ వ్యవహారం మింగుడు పడక పార్టీ కార్యకర్తలు దిక్కుతోచని స్థితిలో పడిపోతున్నారు. దీంతో అగ్రనాయకత్వం గుస్సా అయ్యింది. ప్రధానంగా సోషల్ మీడియాలో పోస్టులు అడ్డూ అదుపు లేకుండా పోతున్నాయి. పార్టీ నేతలు ఆధిపత్యధోరణితో వ్యవహరిస్తూ పెడుతున్న పోస్టుల వెనక సీనియర్ల హస్తం ఉందన్న అనుమానాలు వినవస్తున్నాయి. మారక్తంలోనూ బీజేపీ ఉందని నిత్యం గొప్పలు చెప్పుకునే నేతలు సైతం ఘోరంగా పార్టీ మీద పోస్టులు పెట్టడాన్ని అధినాయకత్వం జీర్ణించుకోలేక పోతోంది. ఎలాగైన సరే దీనికి అడ్డుకట్ట వేసేందుకే సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ నేతలకు సీరియస్ వార్నింగ్ ఇచ్చినట్లు తెలుస్తోంది.పార్టీ పరువు తీసేవారు ఎంతటి నాయకులైనా వదిలే ప్రసక్తే లేదన్నట్లు గా అధినాయకత్వం వ్యవహరిస్తోంది. వెంటపడి మరీ పోస్టుల్ని డిలిట్ చేయిస్తోంది. ఒకరి వ్యక్తిత్వాన్ని దెబ్బతీసే పోస్టులు అవసరమా అని ప్రశ్నస్తుంది. పోస్టుల్ని డిలిట్ చేయించడమ కాకుండా…పోస్ట్ పెట్టిన వారిని ఢిల్లీకి బులావ్ అని పిలిపించుకుని మందలిస్తోంది. పార్టీ నేతలే సొంత టీములు ఏర్పాటు చసుకుని తమకు నచ్చని నేతలపై కామెంట్లు పెడుతున్నారని నాయకత్వం దృష్టికి వచ్చిన దరిమిలా…పార్టీ అధినాయకత్వం చాలా సీరియస్ గా ఉంటోంది. అసలు ఎవరు ఇలా పోస్టులు పెడుతున్నారు? వీరికి అ అవసరం ఏంవచ్చిందని పార్టీ పెద్దలు ఆరా తీస్తే నివ్వెరపోయే నిజాలు తెలిసినట్లు అర్థమవుతోంది. తీగ లాగితే డొంకంతా కదలినట్లు విద్వేష పోస్టుల వెనక పార్టీ పెద్ద తలకాయలే ఉంటుండటంతో అధినాయత్వానికి తలపట్టుక్కూర్చోవలసిన పరిస్థితి ఏర్పడింది. పార్టీ నియమనిబంధనలకు వ్యతిరేకంగా నడుచుకుంటూ పార్టీలో ఉన్నవారిపైనే అన్యాయంగా పోస్టులు పెట్టేవారిపైన కచ్చితంగా కఠిన చర్యలుంటాయని అధిష్టానం అంటోంది. తెలంగాణలో పార్టీ బలోపేతంతో పాటు…2028 నాటికి ప్రజల్లో హిందుత్వ భావనల్ని బలంగా తీసుకెళ్ళడం…మరోసారి కేంద్రంలో అధికారాన్ని చేజిక్కించుకోవడం…ప్రజలకు బీజేపీ తప్ప మరో ప్రత్యమ్నాయం లేదన్నంత మంచిగా పాలించడం ..ఇవీ ఇపుడు బీజేపీ ముందున్న లక్ష్యం. అయితే ఒ వైపు పార్టీని మరింత పటిష్టపరచి మరోసారి దేశంలో అధికారంలోకి రావాలని, రాష్ట్రాల్లో పార్టీని బలోపేతం చేయాలని అధిష్టానం ఆలోచిస్తుంటే…తెలంగాణ బీజేపీలో ముఠా తగాదాలు…సోషల్ మీడియా వార్ పెద్ద తలనొప్పిగా మారిపోయింది.కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, తెలంగాణ పార్టీ అధ్యక్షుడు రామచందర్ రావుతోపాటు మరికొందరు నేతలపై దుష్ప్రచారంతో పోస్టులు పెట్టడం పార్టీకి ఏమాత్రం శ్రేయస్కరం కాదని అధిష్టానం సీరియస్ అవుతోంది. తెలంగాణ గల్లీలో నేతలు పోరాడినా..

# పల్లె పోరులో కాంగ్రెస్ హవా!

హైదరాబాద్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం, కాంగ్రెస్ ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ప్రజల్లో ఉన్న నమ్మకానికి గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాలు అద్దంపడుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఒకటి, రెండు జిల్లాలు మినహా మిగిలిన అన్ని జిల్లాల్లో కాంగ్రెస్ స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శించింది. బీఆర్ఎస్, బీజేపీలకు అనుకూలంగా ఉంటాయని భావించిన జిల్లాల్లో సైతం కాంగ్రెస్ సత్తాచాటింది. ఆదిలాబాద్, కామారెడ్డి, నిజామాబాద్, కరీంనగర్ వంటి జిల్లాల్లో కాంగ్రెస్ బలపరిచిన మెజారిటీ అభ్యర్థులు గెలుపొందారు.

విమర్శలకు చెక్ పెట్టిన ఫలితాలు

గత రెండేళ్ల కాలంలో సీఎం రేవంత్ రెడ్డి ఏ అభివృద్ధి కార్యక్రమాన్ని మొదలుపెట్టినా.. దాన్నో స్కాంగా బీఆర్ఎస్ చిత్రీకరిస్తూ వచ్చింది. సమ్మిట్ నిర్వహించినా, అంతర్జాతీయ ఈవెంట్లు చేపట్టినా సీఎం రేవంత్‌పై స్కాం ముద్ర వేస్తూ బీఆర్ఎస్ రాజకీయం చేసింది. ఇక బీఆర్ఎస్ చేసే విమర్శలకు వంతపాడుతూ బీజేపీ కూడా రేవంత్ రెడ్డిపై అదే స్థాయిలో ఆరోపణలు చేస్తూ వచ్చింది. అయితే, పంచాయతీ ఎన్నికల్లో స్పష్టమైన తీర్పు చెప్పిన తెలంగాణ పల్లె ప్రజలు.. బీఆర్ఎస్, బీజేపీల రాజకీయాల్ని తిప్పికొట్టారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ రెండు విపక్ష పార్టీలు చేసిన, చేస్తున్న విమర్శలను

# తప్పంతా 'ఇండిగో'దేనా?

హైదరాబాద్,భారతీయ విమాన ప్రయాణికులలో చాలా మందికి ఒక విషయం మీద ఏకాభిప్రాయం ఉంది. ఇండిగో తన సామ్రాజ్యాన్ని ఆర్భాటాల మీద గానీ, ఆకర్షణీయమైన గిమ్మిక్స్ మీద గానీ నిర్మించలేదు. అది అత్యంత సులభమైన ఒకే ఒక్క పనిని అసాధారణ సమర్థతతో చేసింది. సమయానికి టేక్ ఆఫ్ కావడం, సమయానికి ల్యాండ్ కావడం. అదే భారతీయుల విశ్వాసాన్ని సంపాదించింది. రోజుకు సుమారు 2,300 విమానాలు, గడియారంలా నడిచే విధానం, దేశీయంగా 90కి పైగా, అంతర్జాతీయంగా 45 గమ్యస్థానాలకు రోజుకు సగం మిలియన్ ప్రయాణికులను ఎలాంటి హడావుడి లేకుండా, సమంజసమైన చార్జీలతో తరలించడం. ఇదే ఇండిగో బలం. కింగ్‌ఫిషర్, జెట్, గో ఫస్ట్ వంటి ప్రత్యర్థి సంస్థలు కూలిపోయిన వేళ, కఠినమైన సామర్థ్యం అనే తన ఆపరేటింగ్ సిద్ధాంతంతో ఇండిగో మరింత బలపడింది. ఆరు ఈ (6ఈ)అనే కోడ్‌తో అది భారత ఆకాశంలో దాదాపు ఏకాధిపత్య స్థాయికి చేరింది. మార్కెట్ వాటా 60% కంటే ఎక్కువ. ప్రపంచంలోనే అతిపెద్ద విమానయాన మార్కెట్ అయిన అమెరికాలో కూడా అతిపెద్ద దేశీయ విమాన సంస్థకు కేవలం 21శాతం మార్కెట్ వాటా మాత్రమే ఉంది. ఆర్థిక సంవత్సరం 2025లో ఇండిగో లాభం (పన్నుల తర్వాత) రూ. 7,258 కోట్లు. ఏప్రిల్ నెలలో కొద్ది రోజులు ప్రపంచంలోనే అత్యధిక మార్కెట్ క్యాపిటలైజేషన్ ఉన్న విమాన సంస్థగా కూడా నిలిచింది. ఈ విజయంలో పెద్ద భాగం దాని మినిమలిస్ట్ వ్యాపార నమూనాదే. ఖర్చులను గట్టిగా కుదించడం. ఉత్పాదకతను గరిష్టస్థాయికి తీసుకెళ్లడం. ఆసియా విమాన సంస్థలలోనే అతి తక్కువ ఖర్చుతో కూడిన 'కాస్ట్ పర్ అవైలబుల్ సీట్ కిలోమీటర్' (సిఎఎస్కె) రూ.3.71. సాధించడం. దీని రహస్య మంత్రం సొగసైన మితవ్యయం. ఒకే రకం విమానాలపై ఆధారపడటం. దాని సుమారు 400 విమానాల భారీ ఫ్లీట్ అంతా ఎయిర్‌బస్‌దే. విమానం ఎగిరినప్పుడే డబ్బు వస్తుంది. ఇండిగో విమానాలు ఇతరుల కంటే ఎక్కువగా ఎగిరాయి. వేగవంతమైన టర్న్‌రౌండ్లు, రోజుకు 12 గంటల వినియోగ లక్ష్యాలు. సీట్లు ఘనంగా అమరిక. విమానంలో వేడి భోజనం లేకపోవడం వల్ల బరువు తగ్గింది. ఇంధన వినియోగం తగ్గింది. తన సొంత ఇష్టై శిక్షణ కేంద్రం లో ప్రమాణీకరించిన సిబ్బంది విధానాలు కార్మిక సామర్థ్యాన్ని పెంచాయి. పైలట్- టు- ఎయిర్‌క్రాఫ్ట్ నిష్పత్తి విశ్లేషకులను ఆశ్చర్యపరిచింది. ఒక్కో విమానానికి సుమారు 13 మంది పైలట్లు మాత్రమే. ఎయిర్ ఇండియా ప్రధాన ఫ్లీట్‌లో ఇది దాదాపు 34కి ఒకటి. వనరుల కేటాయింపులో ఇండిగో కత్తిరించినంత పదునైన ఖచ్చితత్వం చూపింది. ఈ వారపు మీడియా కవర్ స్టోరీస్ మొత్తం ఇండిగో సంస్థపై నడిచింది.కేంద్ర ప్రభుత్వం తన విరోధ భావాన్ని ఈ ఇండిగో సంస్థపై రుద్దింది. ఇండిగో సంస్థ ఓ పదునైన అంచుపై విన్యాసం చేసి, తానే దానికి బలైంది. డిసెంబరు మొదట్లో ఒక్కసారిగా ఇండిగో వల్ల చెలరేగిన గందరగోళం అందరినీ షాక్‌కు గురి చేసింది. కొన్ని రోజుల్లోనే లక్షకు పైగా కాదు, దాదాపు పది లక్షల మంది ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. సుమారు 5,000కి పైగా విమానాలు రద్దయ్యాయి లేదా తీవ్ర ఆలస్యం అయ్యాయి. డిసెంబరు 4 నుంచి 6 మధ్య 2,948 దేశీయ విమానాలు ఆకాశం నుంచి మాయమయ్యాయి. డిసెంబరు 5 ఒక్కరోజే 1,588 రద్దయ్యాయి. ఇది ఇండిగో విమానాల్లో 78 శాతం. విమానాశ్రయాలు రైల్వే స్టేషన్ల కంటే దారుణంగా మారాయి. లగేజ్ ఎక్కడపడితే అక్కడ పేరుకుపోయింది. చాలాసార్లు తప్పు గమ్యస్థానాలకు వెళ్లింది. ప్రత్యర్థి విమాన సంస్థలు సర్జ్ ప్రైసింగ్‌కు దిగాయి. చార్జీలు ఆకాశాన్ని తాకుతుంటే, ఇండిగో ప్రతిష్ఠ నేలచూపులు చూసింది. ఇంత ఘోరంగా ఇండిగో నియంత్రణ కోల్పోవడానికి కారణం ఏమిటి? దీని మూలాలు భారత్ అత్యవసరంగా అవసరమైన ఒక సంస్కరణలో ఉన్నాయి. కొత్త 'ఫ్లైట్ డ్యూటీ టైం లిమిటేషన్స్' (ఎఫ్‌డిటిఎల్), అంటే పైలట్ల అలసట నిర్వహణ నిబంధనలు. పైలట్లు ఎంతసేపు పనిచేయాలి, ఎంత విశ్రాంతి తీసుకోవాలి అన్నది ఇవే నిర్ణయిస్తాయి. ఎన్నో ఏళ్లుగా భారత్ ఈ విషయంలో




అంతర్జాతీయ ప్రమాణాల కంటే చాలా వెనుకబడి ఉంది. న్యాయపోరాటాలు, నిపుణుల సంప్రదింపుల తర్వాత, డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) జనవరి 2024లో సవరించిన ప్రమాణాలను జారీ చేసింది. వాటిని అమలు చేసేందుకు విమాన సంస్థలకు దాదాపు రెండు సంవత్సరాల గడువు ఇచ్చింది. పైలట్ల ఫ్లయింగ్ అవర్స్ తగ్గించబడ్డాయి. తప్పనిసరి విశ్రాంతి 36 గంటల నుంచి 48 గంటలకు పెంచారు. నైట్ డ్యూటీకి కొత్త నిర్వచనం ఇచ్చారు. వారానికి నైట్ ల్యాండింగ్స్‌ను ఆరు నుంచి రెండు వరకు తగ్గించారు. మొత్తం 22 నిబంధనలు, రెండు దశల్లో… జులై 1, నవంబర్ 1 నుంచి అమలు. ఈ కొత్త నిబంధనల ప్రభావానికి అత్యధికంగా గురైన సంస్థ ఇండిగోనే. ఇంత పూర్తిగా 'లీన్ ఎఫిషియెన్సీ' మీద ఆధారపడి నిర్మితమైన మరో విమాన సంస్థ లేదు. అలసట నిబంధనలు పైలట్ల లభ్యతను కత్తిరించాయి. అయితే ఇండిగో సిద్ధమైందా? అందుబాటులో ఉన్న ఆధారాలు 'లేదు' అని చెబుతున్నాయి. ముందస్తు సమాచారం ఉన్నప్పటికీ, పైలట్ల నియామకంలో అది నెమ్మదించింది. ఆశ్చర్యకరంగా, పైలట్ల సంఖ్యను పెంచటానికి బదులు, మార్చిలో ఉన్న 5,463 నుంచి డిసెంబరు నాటికి 5,085కి తగ్గించింది. ఆలస్యంగావచ్చే విమానాల డెలివరీలు, తన స్థాయి వల్ల కొంత వెసులుబాటు దొరుకుతుందనే అంచనాతో అది పందెం కట్టింది. నవంబర్ చివరి నుంచి డిసెంబరు ఆరంభం వరకు వాతావరణం సమస్యలు తెచ్చింది.దక్షిణంలో సైక్లోన్ దిత్వా, ఉత్తరంలో పొగమంచు. ఇప్పటికే అతి పలుచని మానవ వనరుల బఫర్లు ఉండటంతో, రోస్టరింగ్ సాఫ్ట్‌వేర్ జామ్ అయింది. చట్టబద్ధంగా విశ్రాంతి తీసుకున్న పైలట్లు తక్కువగా ఉండగా, విమానాలు ఎక్కువగా ఉండే అసాధ్య సమస్యను అది పరిష్కరించడానికి ప్రయత్నించింది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఇది కేవలం గణిత సమస్య కాదు.తన నిర్మాణ పరిమితులను మించి విస్తరించిన వ్యాపార నమూనా తుదకు తనకు తానే కూలిపోయిన పరిణామం. నియంత్రణ సంస్థ డిజిసిఎ వైఖరి అంత మెరుగ్గా లేదు. పైకి చూస్తే, అది విమాన సంస్థలతో అనేక సమావేశాలు నిర్వహించి, పురోగతిని సమీక్షించినట్టు కనిపించింది. కానీ ప్రధానంగా సంస్థల స్వయం ఘోషణలపైనే ఆధారపడింది. వ్యవస్థ పూర్తిగా కూలిపోయే వరకు ఇండిగో భరోసాలు ఎలా అంగీకరించబడ్డాయి? గణనీయమైన ప్రభావం ఉన్న సంస్థ ఇది. ప్రముఖులతో నిండిన బోర్డు ఉంది. నియంత్రణ సంస్థ పని అందంగా స్వేచ్ఛ ఇవ్వడంకాదు, ఎప్పటికీ అప్రమత్తంగా ఉండటం. అలసట ఆధారిత పని విధానానికి ఇండిగో నిర్వహణ నిజంగా సరిపోతుందా! అని డిజిసిఎ కఠినంగా చూసి ఉంటే, వ్యవస్థ ఈ విధంగా దెబ్బతినేది కాదు. ఈ గందరగోళానికి కారణాలను స్పష్టంగా చెప్పకుండా ఇండిగో నిర్వహణ కూడా తన ప్రతిష్ఠను కాపాడుకోలేకపోయింది. భారత్‌లో ఆపరేటింగ్ ఖర్చుల్లో 30 నుంచి 40 శాతం పన్నులే. అమెరికాలో ఇది సగటున 25% మాత్రమే. తన ఆధిపత్యం వల్ల నియంత్రికులను బందీలుగా చేసుకోవచ్చనే భావన ఇండిగోకు కలిగివుండవచ్చు. అది దాని సామ్రాజ్యం సామర్థ్యంపై నిర్మితమైంది. ఇప్పుడు అది అతి అంచుకు దగ్గరగా నడవకుండా, లాభాల కంటే భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ మళ్లీ నిర్మించుకోవాలి.

# మసకబారుతున్న 'ఎరుపు'



న్యూఢిల్లీ,కేరళలో స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు పాలకవర్గం సిపిఎం నేతృత్వం లోని ఎల్‌డిఎఫ్‌కు, విపక్ష కాంగ్రెస్ సారథ్యంలోని యుడిఎఫ్‌కు గట్టి షాక్ ఇచ్చాయి. చివరకు కేరళ రాజకీయ తెరపై 'కమలం' విరిసింది. రానున్న ఏప్రిల్ మే నెలల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో మూడోసారి కూడా అధికారం చేపట్టేలా ఈ స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు ప్రేరణ కలిగిస్తాయని ఎంతో కలలుగన్న ఎల్‌డిఎఫ్‌కు తీవ్ర ఆశాభంగం తప్పలేదు. గ్రామ పంచాయతీలు, బ్లాక్ పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ నేతృత్వం లోని విపక్షానికే చోటు లభించడం అనూహ్య పరిణామం. 14 జిల్లా పంచాయతీల్లో ఒక్కో ఫ్రంట్ చెరి సమాన సంఖ్యలో సీట్లు దక్కించుకున్నాయి. గత రెండు దశాబ్దాలుగా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతో ప్రజలను ప్రభావితం చేయడంలో పాలకవర్గం ఎల్‌డిఎఫ్ రికార్డు నెలకొల్పినప్పటికీ, ఈసారి దశాబ్ద కాలంగా అధికారంలో లేని యుడిఎఫ్ పైనే ఓటర్లు సానుభూతి చూపించడం ప్రత్యేకంగా గమనించవలసి ఉంది. ప్రతి ఐదేళ్లకు ప్రభుత్వం మారే 50 ఏళ్ల సంప్రదాయాన్ని 2021 లో ఎల్‌డిఎఫ్ ఛేదించినా, ఈసారి ప్రభుత్వంపై వ్యతిరేకత ఎక్కువగానే కనిపించింది.శబరిమల అయ్యప్ప క్షేత్రంలోని బంగారు ఆభరణాల చోరీ, ఆలయ యాజమాన్య బోర్డు ప్రెసిడెంట్ అయిన సిపిఎం నాయకుని అరెస్టు, ఆయనపై తదుపరి చర్య తీసుకోవడానికి అధికార పార్టీ సిపిఎం అంగీకరించకపోవడం ఇవన్నీ అయ్యప్ప భక్తులకే కాదు, ప్రజలకు కూడా తీవ్ర ఆగ్రహాన్ని కలిగించాయి. ఈ విషయం లో అలసత్వం చూపిస్తే తీవ్ర పరిణామాలుంటాయని యుడిఎఫ్ హెచ్చరించింది కూడా. ఇక కాంగ్రెస్ నేతృత్వం లోని యుడిఫ్ విషయానికి వస్తే యువజన కాంగ్రెస్ శాసనసభ్యునిపై అత్యాచార కేసులు ఉన్నప్పటికీ, స్థానిక విజయం అసెంబ్లీ ఎన్నికల ముందు యుడిఎఫ్‌ను మరింత బలోపేతం చేసిందని చెప్పవచ్చు. కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటలున్నాయి. కానీ వాటి గురించి ప్రజలు పట్టించుకోలేదు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వమే ఆ సమస్యను పరిష్కరించుకుంటుందని విడిచిపెట్టి యుడిఎఫ్‌కే పట్టం కట్టారు. దీన్ని గమనించి పార్టీలోని అంతర్గత కుమ్ములాటల చిక్కుముడులను అధిష్ఠాన వర్గం ముందు పరిష్కరించక తప్పదు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎలాంటి సమస్యలను ఎదుర్కొంటున్నారో ఎప్పటికప్పుడు పరిశీలించి, ఆమేరకు స్థానిక నాయకత్వాన్ని పటిష్టపర్చాలి. ప్రజల్లో పార్టీపై నమ్మకం పెంచాలి. ఈ విజయావకాశాన్ని రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమకు తిరిగి ప్రజలు పట్టం కట్టేలా కాంగ్రెస్ నేతృత్వం లోని యుడిఎఫ్ గట్టిగా నిర్మాణాత్మక కృషి సాగిస్తేనే కొంతవరకు నెగ్గుకు రాగలుగుతుంది. తిరువనంతపురం కార్పొరేషన్‌లో ఘన విజయం సాధించిన ఎన్‌డిఎ కూటమి కార్పొరేషన్ పాలనా పగ్గాలు చేపట్టడానికి రంగం సిద్ధం చేసుకుంటోంది.ఇతర ప్రాంతాల్లో సుస్థిరత సాధించలేకపోయినప్పటికీ, రాష్ట్ర రాజధానిగా గుండెకాయ వంటి తిరువనంతపురం కార్పొరేషన్ నుంచి చక్కని పాలన అందించి రాష్ట్రానికి ఆదర్శం అవుతామని బిజెపి ధీమాగా చెబుతోంది. తిరువనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో 45 ఏళ్లుగా ఎల్‌డిఎఫ్ పాలనే కొనసాగుతోంది. ఈసారి మొత్తం 101 వార్డుల్లో 50 వార్డులను బిజెపి (ఎన్‌డిఎ) గెల్చుకుంది. ఎల్‌డిఎఫ్‌కు 29 వార్డులు, యుడిఎఫ్‌కు 19 వార్డులు మాత్రమే దక్కాయి. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు ఇంకా చాలా కాలం ఉన్నప్పటికీ తిరువనంతపురం లోక్‌సభ నియోజకవర్గం లోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఈసారి గెలుపొందడానికి బిజెపి వ్యూహాలు రూపొందిస్తోంది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో అధికార పార్టీ ఎల్‌డిఎఫ్ 99, విపక్షం యుడిఎఫ్ 41 స్థానాలు గెల్చుకోగా, త్రిస్సూర్ స్థానాన్ని ఎన్‌డిఎ దక్కించుకుంది. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్‌డిఎ థర్డ్ ఫ్రంట్‌గా అవతరించకుండా ఉంటే స్థానిక సంస్థల విజయాలపై యుడిఎఫ్ మరింత ఉత్సాహంగా ఉండేది. రాష్ట్రంలో ఎక్కువగా ద్విపార్శ్య సంకీర్ణ పోటీలు జరుగుతున్నాయి. ఈ పార్టీలు ఏ సమయంలో ఎటువైపు మొగ్గు చూపుతాయో చెప్పడం కష్టం. ఈ నేపథ్యంలో మూడవ ఫ్రంట్‌గా ఎన్‌డిఎ కూటమి అవతరించడం మిగతా పార్టీలన్నిటికీ గందరగోళంగా మారే పరిస్థితి ఏర్పడుతుంది.దేశంలోనే ఏకైక వామపక్ష పాలక రాష్ట్రంగా కేవలం తన వ్యక్తిత్వంతో ఆదర్శాన్ని పినరయి విజయన్ ప్రదర్శించారు. ఇప్పుడు ఓటు వాటాల పరంగా వారి ఉనికితో సంబంధం లేకుండా ఎల్‌డిఎఫ్ ఓడిపోవడం వామపక్ష పార్టీలను ఓ మూలకు నెట్టేసినట్టే అవుతోంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి సురేష్ గోపీ త్రిస్సూర్ లోక్‌సభ స్థానం నుంచి 74,686 ఓట్ల మెజార్టీతో చారిత్రాత్మక విజయం సాధించారు. బిజెపి ఏకైక ఎంపీగా నిలిచారు. ఈ విజయం కేరళ రాజకీయాల్లో త్రిముఖ పోటీకి నాంది పలికిందని, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపికి విజయావకాశాలు మెండుగా ఉంటాయని కాషాయ నాథులు అంచనా వేశారు. కానీ లోక్‌సభ ఎన్నికల ప్రభావం స్థానిక సంస్థల ఎన్నికలపై ఏమాత్రం పడలేదు. కమలనాథుల అంచనాలన్నీ తలకిందులయ్యాయి. 2020 నుంచి త్రిస్సూర్ స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు బిజెపికి తప్పుడు సంకేతాలనే అందిస్తున్నాయి. ఆనాడు త్రిస్సూర్ అసెంబ్లీలో బిజెపి 6, ఎల్‌డిఎఫ్, యుడిఎఫ్ చెరో 24 స్థానాలను సాధించుకున్నాయి. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో త్రిస్సూర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఇలాంటి ఫలితాలు రాకూడదని పార్టీలు అనుకుంటున్నాయి. ఏదేమైనా సిపిఎం పట్టు సడలి అరుణ కిరణాలు మసకబారుతున్నాయా? అన్నప్రశ్న ఎదురవుతోంది.

# పరకామణి లెక్కింపు ఇంకా పాతపద్ధతేనా?

అమరావతి, టీటీడీ పరకామణి లెక్కింపును ఆధునీకరించాలని రాష్ట్ర హైకోర్టు సూచించింది. ఆధునికకాలంలో కూడా పాతపద్ధతిలో లెక్కింపు సరికాదని తెలిపింది. పరకామణి చోరీ కేసుపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో మంగళవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఇరుపక్షాల న్యాయవాదుల మధ్య వాదోపవాదనలు జరిగాయి. ఈ సందర్భంగా హైకోర్టు పలు కీలక సూచనలు చేసింది. తిరుమల శ్రీవారి పరకామణిలో జరిగే చోరీలను సాధారణ దొంగతనంగా చూడటానికి వీల్లేదని స్పష్టం చేసింది. కానుకల రూపేణా వచ్చిన సొమ్ము చోరీకి గురయితే కోట్లాదిమంది భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని హైకోర్టు తెలిపింది. పరకామణిలో కానుకల లెక్కింపు ప్రక్రియను ఆధునీకీకరించాల్సిన అవసరముందని వెల్లడించింది. మానవ ప్రమేయాన్ని తగ్గించి.. యంత్రాలు, ఏఐ టెక్నాలజీని వినియోగించాలని తిరుమల తిరుపతి దేవస్థానానికి సూచించింది. టీటీడీలో ఇలాంటి చోరీ ఘటనలు జరుగుతున్నా కానుకలు లెక్కించేందుకు అదే పాత విధానాన్ని అనుసరించడం సరికాదని న్యాయస్థానం స్పష్టం చేసింది. కానుకల లెక్కింపునకు సేవాభావంతో వచ్చిన భక్తులను దుస్తులు లేకుండా సోదాలు చేయడం, దొంగల్లా అవమానించడం తగదని పేర్కొంది. కానుకలు లెక్కింపునకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను వినియోగించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఈ విషయంలో తగిన సూచనలు, సలహాలతో తమ ముందుకు రావాలని సూచించింది. ఈ క్రమంలోనే ఇరుపక్షాల న్యాయవాదులకు ఏపీ హైకోర్టు పలు సూచనలు చేసింది.

# బిఆర్ఎస్ పార్టీ సమావేశం 21కి వాయిదా

హైదరాబాద్,ఈ నెల 19న జరగాల్సిన బీఆర్ఎస్ఎల్పీ, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సంయుక్త సమావేశం వాయిదా పడింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఐఅఖీ) ఆదేశాల మేరకు డిసెంబర్ 21న ఈ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు పార్టీ సీనియర్ నేత హరీశ్ రావు వెల్లడించారు. ఈ నెల 19వ తేదీతో పార్లమెంట్ సమావేశాలు ముగియనున్న నేపథ్యంలో బీఆర్ఎస్ పార్లమెంట్ సభ్యులు కూడా ఈ సమావేశంలో పాల్గొనడం కోసం వాయిదా వేయడం జరిగింది. ఈనెల 21న కేసీఆర్ అధ్యక్షతన తెలంగాణ భవన్ వేదికగా నిర్వహించే బిఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో గౌరవ పార్లమెంట్ సభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసన సభ్యులు పాల్గొననున్నారు. కృష్ణా, గోదావరి జలాల విషయంలో రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై, పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన నీటిపారుదల ప్రాజెక్టులను నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు తీసుకుపోవడంలో చూపిస్తున్న నిర్లక్ష్య వైఖరిపై ఈ సమావేశంలో చర్చ జరుగనున్నది. గోదావరి, కృష్ణ జలాలను కొల్లగొడుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దోపిడీని అడ్డుకోవడంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. ఈ క్రమంలో తెలంగాణ ప్రజల రైతాంగ సాగునీటి హకులను కాపాడుకోవడానికి మరో ప్రజా ఉద్యమం తప్పదని బీఆర్ఎస్ భావిస్తున్నది. ఏపీ జలదోపిడీపై తెలంగాణ ప్రజా ఉద్యమాలు ఎలా చేపట్టాలనే అంశంపై పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో పార్టీ నాయకులతో కలిసి అధినేత కేసీఆర్ లోతుగా చర్చించనున్నారు.

# ఇంకా కొలిక్కిరాని ఫిరాయింపుల కేసు

హైదరాబాద్,తెలంగాణలో పార్టీ ఫిరాయింపుల కేసు ఓ కొలిక్కి రాలేదు. ఈలోగా కేసును విచారించిన చీఫ్ జస్టిస్ గవాయ్ పదవీవిరమణ పొందారు. ఈ తీర్పు ..తద్వారా తీసుకునే నిర్ణయం ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయిన అనుకున్నారు. కానీ స్పీకర్ వద్ద పదిమంది ఎమ్మెల్యేల ఫిరాయింపు వ్యవహారం ఎటూ తేలడం లేదు. సుప్రీం ఇచ్చిన మూడు నెలల గడువు అయిపోయింది. స్పీకర్ మరికొంత సమయం కోరారు. ఇప్పుడు దీనిపై ఏదైనా నిర్ణయం తీసుకుంటారా అన్న ఉత్కంఠ నెలకొంది.ఏదేని సభ్యుడు పార్టీ ఫిరాయించాడని భావిస్తే, ఆ సభ్యుడి మిగతా కాలానికి సభ్యత్వం రద్దుచేసే అధికారం రాజ్యాంగం స్పీకర్‌కు ప్రసాదించింది. పార్టీ ఫిరాయింపు అనర్హత పిటిషన్ స్పీకర్ ముందు పెండింగ్‌లో ఉన్న సమయంలో, సభ్యుడు స్వయంగా సభ్యత్వానికి రాజీనామా కూడా సమర్పించవచ్చు. ఈ రెండు సందర్భాల్లోనూ ఆ సభ్యుడు తిరిగి జరుగబోయే ఉప ఎన్నికలో లేదా సాధారణ ఎన్నికల్లో తనకు నచ్చిన రాజకీయ పార్టీ సభ్యుడిగా పోటీ చేయవచ్చు. రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ పార్టీ మారిన సభ్యుడి సభ్యత్వ రద్దుకు మాత్రమే పరిమితమైంది. సభ్యత్వ రద్దు కాకుండా ఇతర చట్టపరమైన చర్యల గురించి ఎలాంటి ప్రస్తావన లేకుండటంతో పార్టీలు మారేవారు దానిని తమకనుకూలంగా మార్చుకుంటున్నారు.దీనికి భిన్నంగా ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్లు, 8 నుంచి 10లో ప్రస్తావించిన నేరాలకు సంబంధించి శిక్షకు గురికాబడిన సభ్యుడు, 3 నుంచి 6 ఏండ్ల పాటు చట్టసభలకు పోటీ చేయడానికి అనర్హుడు. అయితే, ఈ అనర్హతను రద్దుచేసే లేదా కాలవ్యవధిని తగ్గించే అధికారం కేంద్ర ఎలక్షన్ కమిషన్‌కు ఆ చట్టం కట్టబెట్టింది. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద స్పీకర్ ముందు దాఖలైన ఫిర్యాదుల్లో తీర్పు తమకు వ్యతిరేకంగా వస్తుందని భావించి నాటి ఏపీ శాసనసభలోని ఆరుగురు సభ్యులు ముందుగానే తమ సభ్యత్వానికి రాజీనామా చేశారు. దానితో అప్పటి స్పీకర్ వారి రాజీనామాలను ఆమోదిస్తూ ఎటువంటి తీర్పు ప్రకటించకుండా ఫిర్యాదులను మూసివేశారు. రాజీనామాలు ఆమోదించినా, భారత రాజ్యాంగంలో తదుపరి తీసుకోవలసిన శిక్షా నిబంధనల గురించి ఎలాంటి ప్రస్తావన లేదు. దీంతో మరే విధమైన చర్యలు తీసుకోకుండా అనర్హత వేటు ఫిర్యాదులను మూసివేయవలసి వచ్చిందని స్పీకర్ ప్రకటించారు. ప్రజా ప్రాతినిధ్య చట్టంలో ఏ విధంగానైతే కొన్నేండ్ల పాటు పోటీ చేయడానికి అనర్హత వేటు కల్పించబడిందో అదేవిధంగా లక్షల ఓటర్ల అభీష్టం మేరకు ఒక పార్టీ ప్రతినిధిగా ఎన్నుకోబడి ఆ పార్టీకి రాజీనామా చేయ కుండా వేరొక రాజకీయ పార్టీలోకి ఫిరాయిస్తే ఆ సభ్యుడి సభ్యత్వం రద్దు చేయాలి. అంతేకాదు తిరిగి చట్టసభలకు పోటీ చేయడానికి అనర్హుడిగా ప్రకటించే హక్కును స్పీకర్‌కు కల్పిస్తూ రాజ్యాంగ సవరణ చేయాలి. పార్టీ ఫిరాయింపు ఫిర్యాదును స్పీకర్ పరిష్కరించే కాలవ్యవధి కూడా రాజ్యాంగ సవరణ ద్వారా గడువు విధించాలి. అప్పుడే ఈ ఫిరాయింపుదారుల కట్టడి చేసినట్టవుతుంది. తెలంగాణలో పదిమంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించారు. వారి వ్యవహారం గత ఏడాదిన్నరగా ఎటూ తేలడం లేదు. సుప్రీం తీర్పు ఇచ్చినా కర్ర విరగకుండా..పాము చావకుండా అన్న రీతిలో సాగింది,. చట్ట సభలకు ఎన్నికైన వారు పార్టీలు మారే సందర్భంలో ఖచ్చితమైన నిబంధనలు ఉంటే తప్ప సభ్యుల్లో జవాబుదారీతనం పెరగదు. అధికారంలో ఉన్న పార్టీకి ప్రతిపక్ష పార్టీ సభ్యులను ప్రలోభపరిచే అవకాశం రాదు. అలాగే ప్రతిపక్ష పార్టీతో చేతులు కలిపి అధికార పక్ష పార్టీని అస్థిరపరచే కుట్రలకు అడ్డుకట్ట పడుతుంది. ఒకవేళ తాను ఎన్నుకోబడిన పార్టీ విధానాలు నచ్చకపోతే సభ్యుడు పార్టీకి రాజీనామా చేయాలి .

# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

ముంబై,మార్కెట్లో బంగారం ధరలు కాస్తంత తగ్గాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం.. హైదరాబాద్‌లో దేశంలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై రూ.1520 మేర తగ్గి.. రూ.1,33,860గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ గోల్డ్‌పై రూ.1,400 పతనమై.. రూ.1,22,700గా ఉంది. ఇక వెండి విషయానికొస్తే.. నిన్న ఆకాశాన్నంటిన వెండి ధరలు కాస్త తగ్గాయి. ప్రస్తుతం.. కిలో వెండి రేటు రూ.2,11,000గా ఉంది.

# ఎంపీలతో లోకేశ్.. ఢిల్లీలో ఇదే హాట్ టాపిక్!



అమరావతి,ఏపీ మంత్రి నారా లోకేశ్ ఢిల్లీ పర్యటనపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. సోమవారం ఢిల్లీకి వచ్చిన మంత్రి లోకేశ్ ఏపీకి సంబంధించిన పలు ప్రాజెక్టులు, నిధులపై ముగ్గురు కేంద్ర మంత్రులను కలిశారు. దీర్ఘకాలికంగా పెండింగులో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు బిజీబిజీగా గడిపిన మంత్రి లోకేశ్.. ముగ్గురు కేంద్ర మంత్రులను కలిశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు బదులుగా ప్రభుత్వం తరఫున ఢిల్లీకి వస్తున్న లోకేశ్ కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తూ రాష్ట్రానికి అవసరమైన పనులు చేయించుకుంటున్నారు. అయితే లోకేశ్ పర్యటనల సందర్భంగా కనిపించే దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.సోమవారం ఢిల్లీ వచ్చిన లోకేశ్ ముగ్గురు కేంద్ర మంత్రులను కలవగా ఆయన వెంట టీడీపీ, జనసేన ఎంపీలు ఉండటం ప్రత్యేక ఆకర్షణగా వ్యాఖ్యానిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో కీలకంగా పనిచేస్తున్న లోకేశ్.. పార్టీకి భావినేతగా ప్రచారంలో ఉన్నారు. దీంతో ఆయన దృష్టిలో పడేందుకు పార్టీలో మిగిలిన నేతలు ఆరాటపడుతుంటారు. ఇదే సమయంలో లోకేశ్ కూడా తన పార్టీ వారితో చాలా సన్నిహితంగా ఉంటూ వారినీ తనతోపాటే తిప్పడంపై ఎక్కువగా చర్చ జరుగుతోంది. సహజంగా లోకేశ్ స్థాయి నేతలు అంటే ఒక పార్టీని నడిపే నేతలు ఇలా గుంపుగా ఎక్కడికి వెళ్లేందుకు ఇష్టపడరని, ఒకరో ఇద్దరినో తమతో తీసుకువెళ్లి కావాల్సిన పనులు చేయించుకుంటారని అంటున్నారు.కానీ, లోకేశ్ మిగిలిన నేతలకు భిన్నంగా తాను ఎక్కడికి వెళ్లినా, అందుబాటులో ఉన్న నేతలు అందరినీ తీసుకువెళ్లడం, మిత్రపక్షాలకు చెందిన నేతలను భాగస్వామి చేస్తుండటమే ఆకర్షిస్తోందని అంటున్నారు. దీనివల్ల ప్రభుత్వ పనుల్లో పార్లమెంటు సభ్యులకు భాగస్వామ్యం ఇచ్చినట్లు అవుతోందని అంటున్నారు. గతంలో పార్లమెంటు సభ్యులు అంటే రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేదన్నట్లు ఉండేదని, కానీ ఇప్పుడు రాష్ట్రానికి ఏం కావాలి? ఏం చేయాలి? అన్న విషయాలపై మంత్రి లోకేశ్ సారథ్యంలో ఎంపీలకు అవగాహన కల్పిస్తున్నారని అంటున్నారు.నిజానికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎంపీలకు కొన్ని కీలక బాధ్యతలు అప్పగించారు. రాష్ట్రానికి చెందిన కూటమి ఎంపీలు 21 మందికి ఢిల్లీలో ప్రభుత్వ విభాగాల బాధ్యతలను సమానంగా అప్పగించారు. దీనిప్రకారం ప్రతి ఎంపీ తనకు కేటాయించిన శాఖ ద్వారా రాష్ట్రానికి పథకాలు తీసుకురావాల్సివుంటుంది. అయితే ఇంతవరకు ఎంపీలు ఈ దిశగా పనిచేసినట్లు ఎక్కడా కనిపించలేదు. అయితే యువనేత లోకేశ్ మాత్రం.. కూటమి ఎంపీలు అందరినీ కలుపుకొని కేంద్ర మంత్రులను కలుస్తుండటం వల్ల వారికి పరిచయాలు పెరుగుతున్నాయని అంటున్నారు.దీనివల్ల కేంద్రంలో కూడా టీడీపీ ఎంపీలు ప్రత్యేక ముద్ర వేసేలా పనిచేసే అవకాశం దొరుతుందని వ్యాఖ్యానిస్తున్నారు. సోమవారం ఢిల్లీలో ముగ్గురు కేంద్ర మంత్రులను కలిసిన లోకేశ్ తనతో రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ తోపాటు టీడీపీ, జనసేన పార్లమెంటు సభ్యులు అందరినీ తీసుకువెళ్లారు. దీనివల్ల వారందరికీ కేంద్రం నుంచి రాష్ట్రానికి కావాల్సిన నిధులు, కేంద్రం ఇస్తామన్న పథకాలు ఏ దశలో ఉన్నాయి..? ఏం చేయాలన్న అవగాహన కలిగించినట్లైందని అంటున్నారు.

# ఐడీపీఎల్ భూములు: అసలేంటీ వివాదం?




న్యూఢిల్లీ,ఐడీపీఎల్ భూములు.. ఇప్పుడు ఈ వ్యవహారం రాజకీయంగా చర్చకు దారితీసింది. హైదరాబాద్ నగరంలో ని కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలో ఉన్న ఐడీపీఎల్... కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ. ఐడీపీఎల్ అంటే.. ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్ లిమిటెడ్. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఔషధ పరిశ్రమకు ప్రాధాన్యం ఇస్తూ.. హైదరాబాద్‌లోనే ప్రత్యేకంగా ఈ సంస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.ఈ క్రమంలో కూకట్‌పల్లి పరిధిలోని సర్వే నెంబరు 376లో భూములు కేటాయించారు. దేశ ఔషధ రంగానికి ఇది తలమానికంగా ఉండాలని కూడా ప్రభుత్వం అప్పట్లో పేర్కొంది. అయితే.. ఆ తర్వాత రాష్ట్ర విభజన నేపథ్యంలో.. ఈ ప్రాజెక్టును ఎవరూ పట్టించుకోలేదు. పైగా.. ఇక్కడ స్థానికులు కొందరు.. పాకలు, షెడ్లు వేసుకుని నివసిస్తున్నారు. అయినా.. కేసీఆర్ సర్కారు దీనిని పెద్దగా పట్టించుకోలేదు. అనంతర కాలంలో పెద్ద ప్రహరీ కూడా నిర్మించారు. ఈ వ్యవహారమే రాజకీయంగా ఇప్పుడు దుమారం రేపుతోంది.ప్రభుత్వం కేటాయించిన ఐడీపీఎల్ స్థలాన్ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆక్రమించారన్నది జాగృతి సంస్థ నేత కవిత ఆరోపిస్తున్నారు. కానీ.. తానేమీ స్థలాన్ని ఆక్రమించలేదని.. చట్టబద్ధంగా కొంత భూమిని సమీపంలో కొనుగోలు చేశానని మాధవరం చెబుతున్నారు. ఇది వివాదంగా మారింది. ప్రస్తుతం ఈ భూమి విలువ 4 వేల కోట్ల రూపాయలకు పైచిలుకుగా ఉండడం.. రాజకీయ దుమారం రేగడానికి కారణమైందన్న వాదన ఉంది.వాస్తవానికి ఇక్కడ భారీ ప్రాజెక్టును కట్టి.. ఔషధరంగాన్ని డెవలప్ చేయాలని సంకల్పించారు. కానీ, ఆదిశ గా అడుగులు పడలేదు. ఈ భూములు మార్కెట్ విలువ పరంగా చాలా ఖరీదైనవి కావడం, కేంద్ర ప్రభుత్వ సంస్థ కావడం, కాలక్రమేణా సంస్థ మూతపడటంతో ఈ భూములు ఆక్రమణలకు గురయ్యాయన్నది వాస్తవం. కేసీఆర్ హయాంలోనూ ఈ భూముల విషయంపై ఆరోపణలు వచ్చాయి. కానీ, ఇప్పుడు కవిత రంగ ప్రవేశంతో ఈ దూకుడు మరింత పెరిగింది.

# ఒకవేళ కవిత సీఎం అయితే?



హైదరాబాద్,నెటిజన్ల నుంచి అభిప్రాయాలు సేకరించిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత.. ఇదే సమయంలో పలువురు నెటిజన్లు అడిగిన ప్రశ్నలకు కూడా ఆమె సమాధానం చెప్పారు. ఒకరు స్పందిస్తూ.. వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తారా? అని అడగ్గా.. తప్పకుండా చేస్తానన్నారు. ఆమె 2029లో జరిగే ఎన్నికల్లో పోటీ చేయనున్నట్టు చెప్పారు. అంటే.. పార్లమెంటుకు కవిత పోటీ చేస్తారన్న చర్చ తెరమీదికి వచ్చింది. వాస్తవానికి.. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు 2028లో జరగనున్నాయి. సో.. ఆమె మాత్రం 2029లో పోటీ చేస్తానని చెప్పడంగమనార్హం.మరో నెటిజన్ స్పందిస్తూ.. విద్య వ్యాపారం అయిందని, మీరు ముఖ్యమంత్రి అయితే.. ఏం చేస్తారని ప్రశ్నించగా%”%. తాము అధికారంలోకి వస్తే.. విద్యను మరింత చేరువ చేస్తామన్నారు. పేరెంట్లపై ఎలాంటి ఆర్థిక భారం కాని విధంగా విద్యను అందిస్తామన్నారు. ప్రస్తుత దోపిడీ విధానానికి తాము వ్యతిరేకమన్న కవిత.. దీనిపై సమగ్రంగా అధ్యయనం చేయనున్నట్టు వివరించారు. పిల్లల చదువుల కోసం తల్లిదండ్రులు రూపాయి కూడా కట్టకుండా కేజీ నుంచి పీజీ వరకు ఉచితంగా అందిస్తామన్నారు. ఇక, రైతుల ఆత్మహత్యలపై కొందరు అడిగిన ప్రశ్నలకు స్పందిస్తూ.. తాను కూడా ఈవిషయంలో చాలా బాధపడుతున్నట్టు కవిత చెప్పారు. ఆదిలాబాద్‌లో పర్యటించినప్పుడు పత్తి రైతులు కొందరు ఆత్మహత్య చేసుకున్న వ్యవహారం తెలిసి చలించిపోయానన్నారు. అయితే.. ప్రభుత్వాల నిర్లక్ష్యం, ఉదాసీనత కారణంగానే రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని కవిత వ్యాఖ్యానించారు. రైతులకు మేలు చేసేలా తామునిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలన, ఆయన వ్యవహార తీరుపై మీరేమంటారంటూ.. నెటిజన్ అడిగిన ప్రశ్నకు కవిత ఆసక్తికర సమాధానం చెప్పారు. “హామీలను బుట్టదాఖలు చేశారు. నిబద్ధతను నిరూపించుకోవడంలో విఫలమయ్యారు. ప్రభుత్వం పట్ల, ముఖ్యమంత్రి పట్ల ప్రజలు తీవ్ర నిరాశ నిస్పృహల్లో ఉన్నారు“ అని కవిత పేర్కొన్నారు. కాగా.. మరో నెటిజన్ అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. జాగృతి సంస్థను సమాజంలోని ప్రతి ఒక్కరి సాధికారతకు కృషి చేసేలా చేరువ చేస్తామని కవిత చెప్పారు. ఈ క్రమంలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీలు సహా అన్ని సామాజిక వర్గాలకూ జాగృతిని చేరువ చేస్తూ..కమిటీలను ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు.

# వీక్ పాయింట్స్ పట్టేశారా..ఒకే టైం లో కేసీఆర్..జగన్

హైదరాబాద్,తెలుగు నాట రాజకీయాలు ఒకే మాదిరిగా సాగుతున్నాయి. అధికార పక్షం తెలంగాణాలో ఏపీలో బలంగా ఉంది. మంచి జోష్ మీద కూడా ఉంది. ఏపీలో టీడీపీ కూటమి 2024లో అధికారంలోకి వచ్చింది. మూడు ప్రధాన పార్టీలు అయిన తెలుగుదేశం జనసేన బీజేపీ జత కట్టి మరీ అప్పటికి అధికారంలో ఉన్న వైసీపీని ఓడించాయి. ఇక తెలంగాణాలో చూస్తే కనుక 2023లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. చిత్రమేంటి అంటే ఇక్కడ పొత్తులు లేవు, సింగిల్ గానే కాంగ్రెస్ పవర్ దక్కించుకుంది. బీఆర్ఎస్ బీజేపీ రెండూ కూడా విడిగానే పోటీ చేశాయి. త్రిముఖ పోరు అక్కడ సాగింది. 2028లో తిరిగి ఎన్నికలు ఉన్నాయి. ఆనాటికి ఏ రెండు పార్టీల మధ్య పొత్తులు కుదురుతాయి అన్నది కూడా తెలియకపోగా మరో ఒకటో రెండో కొత్త పార్టీలు కూడా రంగంలోకి దిగే చాన్స్ ఉంది అని అంటున్నారు

**ధీమాతోనే అంతా :**

ఇక చూస్తే మరో విషయం ఏంటి అంటే ఏపీలో కూటమి పెద్దలు తాము ఏకంగా పదిహేనేళ్ళ పాటు అధికారంలో ఉంటామని చెబుతున్నారు. ఏపీలో సమగ్రమైన ప్రగతికి అయిదేళ్ళ సమయం చాలదని మరో రెండు టెర్ములు కావాలని కోరుతున్నారు. అలా తామే మళ్ళీ మళ్ళీ గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణాలో చూస్తే కనుక 2034 వరకూ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి అనేక సార్లు ప్రకటన చేసి ఉన్నారు. అంతే కాదు తాను మళ్ళీ సీఎం అని ఆయనే ఫుల్ కాన్ఫిడెన్స్ తో ప్రకటిస్తున్నారు.

**రంగంలోకి విపక్షం :**

ఇలా అధికార పక్షం అక్కడా ఇక్కడా పూర్తి ధీమాతో ముందుకు సాగుతూంటే రెండు చోట్ల విపక్షం తీరు ఇన్నాళ్ళూ కొంత స్తబ్దుగానే సాగింది. ఏపీతో పోలిస్తే తెలంగాణాలో బీఆర్ఎస్ జోరు చేసినా అసలైన నాయకుడు కేసీఆర్ మాత్రం కేరాఫ్ ఫాం హౌస్ గా ఇన్నాళ్ళూ ఉంటూ వచ్చారు. ఆయన చడీ చప్పుడూ రాజకీయంగా అయితే లేదు. ఇక ఏపీలో వైసీపీ క్యాడర్ ద్వారా ఆందోళనలు నిర్వహింపచేస్తూ జగన్ మాత్రం తాను తెర చాటునే ఉంటూ వస్తున్నారు. ఆయన సైతం కేరాఫ్ బెంగళూర్ గానే ఉంటున్నారు. అయితే 2026లోకి అడుగు పెడుతున్న వేళ అటు కేసీఆర్ ఇటు జగన్ రాజకీయ రంగంలోకి తిరిగి ఫుల్ యాక్టివ్ మోడ్ లో దిగబోతున్నారు అని అంటున్నారు. కేసీఆర్ అయితే అటు పార్టీతో ఇటు ఎమ్మెల్యేలతో విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. దాంతో భారీ యాక్షన్ ప్లాన్ తో ఆయన తెలంగాణాలోని రేవంత్ రెడ్డి సర్కార్ ని ఢీ



కొట్టేందుకు పూర్తి స్థాయిలో సన్నద్ధం అవుతున్నారు.

**జగన్ సైతం :**

ఇక ఏపీలో జగన్ కూడా 2026 క్యాలెండర్ ని ఫుల్ గా వాడుకోవాలని చూస్తున్నారు. తన కాల్షీట్లు మొత్తం ఆ ఏడాదంతా ఇచ్చి మరీ జనంలోనే ఉండేలా పక్కా ప్లాన్ చేసుకుంటున్నారు. బస్సు యాత్రతో ముందు ప్రతీ జిల్లాలో క్యాడర్ ని పలుకరిస్తూ ప్రతీ నియోజకవర్గంలో గ్రౌండ్ లెవెల్ రియాలిటీస్ తెలుసుకుంటూ పార్టీని పటిష్టం చేసే ముమ్మర కార్యక్రమానికి జగన్ శ్రీకారం చుట్టబోతున్నారు.

**వీక్ నెస్ తోనే :**

రాజకీయం ఎపుడూ ప్రత్యర్ధి వీక్ నెస్ ని పట్టుకుంటేనే పండుతుంది. అదను కోసం చూసి బరిలోకి దిగడమే రాజకీయాల్లో అసలైన వ్యూహం. ఆ విధంగా చూస్తే ఇన్నాళ్ళూ సైలెంట్ మోడ్ లో ఉన్న కేసీఆర్ కానీ జగన్ కానీ ఇపుడు ఒక్కసారిగా జనంలోకి రావాలని అనుకోవడం వెనక ఆలోచనలు ఏమిటి అన్న చర్చ సాగుతోంది. ఈ ఇద్దరు అధినేతలు అధికారంలో ఉన్న ప్రభుత్వాల విషయంలో బలహీనతలను పట్టుకున్నారా అన్న డిస్కషన్ సాగుతోంది. అలాగే జనం పల్స్ కూడా తెలుసుకుంటూ తమకు అనుకూలంగా రాజకీయాన్ని తిప్పడానికి ఇదే తగిన సమయంగా భావించి ఫీల్డ్ లోకి దిగబోతున్నారా అన్నది కూడా చర్చగా ఉంది. ఏది ఏమైనా ప్రభుత్వం పట్ల ప్రజలలో ఎన్నో ఆశలు ఉంటాయి. అవి నెమ్మదిగా కాలంతో పాటుగా కరిగిపోతూ అసంతృప్తులుగా మారుతాయి. సరిగ్గా దానిని అంచనా వేసి ప్రతిపక్షం రంగంలోకి దిగితే పరిస్థితి వారికి సానుకూలం అవుతుంది. మరి రాజకీయ వ్యూహాలలో తమదైన శైలిలో ముందుకు సాగే కేసీఆర్ జగన్ అధికారం పక్షం వీక్ నెస్ ని గుర్తించారా అన్నదే చర్చగా ఉంది మరి.

# టీ-బీజేపీ..మోడీ చెప్పాక కూడా మార్పు రాలేదా?



న్యూఢిల్లీ,తెలంగాణ బిజెపిని దారిలో పెట్టాలని, నాయకుల మధ్య ఐక్యత ఉండాలని, రాజకీయంగా దూకుడు పెంచాలని కచ్చితంగా నాలుగు రోజుల కిందట ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలంగాణ బిజెపి ఎంపీలకు సూచించారు. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో బలమైన నాయకత్వాన్ని పెంపొందించాలని కూడా ఆయన చెప్పారు. నిజానికి ఏ రాష్ట్రం గురించి కూడా ప్రధాని నరేంద్ర మోడీ ఇప్పటివరకు ఈ విధంగా వ్యాఖ్యలు చేయలేదు. పార్టీని బలోపేతం చేయాలని లేదా నాయకుల మధ్య సమన్వయం ఉండాలని కానీ ఈ పది సంవత్సరాల కాలంలో ప్రత్యేకంగా ఆయన ప్రస్తావించలేదు.కానీ, దక్షిణాదిపై బిజెపి పెద్ద ఎత్తున లక్ష్యం పెట్టుకుంది. దీనిలో భాగంగానే తెలంగాణ బిజెపిపై నిశితంగా దృష్టి పెట్టింది. కానీ, ఇక్కడి నాయకుల మధ్య కలివిడి లోపిస్తోంది. ఐక్యత అసలు కనిపించడమే లేదు. పైగా ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్న పరిస్థితి స్పష్టంగా ఉంది. ఈ నేపథ్యంలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేరుగా జోక్యం చేసుకుని అందరూ కలిసిమెలిసి పని చేయాలని.. ఐక్యతకు పెద్దపీట వేయాలని.. ప్రభుత్వాన్ని టార్గెట్ చేయాలని ఆయన చెప్పారు.కానీ ఆ మార్పు దిశగా తెలంగాణ బిజెపి నాయకులు ఇప్పటివరకు ఒక అడుగు కూడా ముందుకు వేయలేదు అన్నది కనిపిస్తుంది. నిజానికి పార్టీ అధిష్టానం చెప్తే ఒక రకంగా ఉంటుంది. కానీ పార్టీలో పెద్దన్నగా, పార్టీని ఒకరకంగా నడిపిస్తున్న నాయకుడిగా మోడీ ఉన్నప్పుడు ఆయన చెప్పిన తర్వాత కూడా కనీసం మార్పులు లేకుండా నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం విశేషం. అదేవిధంగా ఈటల రాజేందర్ లాంటివాళ్ళు తాము ఏ పార్టీలో ఉండాలో ప్రజలను నిర్ణయిస్తారని చెప్పటం మరో కొసమెరుపు.క, కేంద్ర మంత్రి బండి సంజయ్.. ఈటల రాజేందర్ ను టార్గెట్ చేయడం.. కేంద్రంలో మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి అసలు కనిపించకుండా పోవడం ఇలా అనేక సమస్యలు తెలంగాణ బిజెపిని పట్టిపీడిస్తున్నాయని చెప్పాలి. మరి మోడీ చెప్పిన తర్వాత అయినా మారుతుందా అని అందరూ ఆశలు పెట్టుకున్నప్పటికీ ఆ దిశగా అయితే అడుగులు ఎక్కడ వేస్తున్నట్టుగా కనిపించడం లేదు. మరి ఎప్పటికీ మారతారు అసలు పట్టించుకుంటారా లేదా మళ్లీ ఎన్నికల వరకు ఇలాగే ఉంటుందా అనేది తెలంగాణ బిజెపి నాయకుల మధ్య చర్చ నడుస్తోంది.ప్రస్తుతం జరుగుతున్న పంచాయతీ ఎన్నికల్లో అత్యంత బలహీనంగా బిజెపి ఉందన్నది స్పష్టంగా తెలుస్తోంది. గ్రామీణ స్థాయిలో బలోపేతం కావాలన్న ప్రధాని లక్ష్యాన్ని వదిలేసి నాయకులు ఎవరికి వారు రాజకీయాలు చేస్తుండడంతో ఈ పరిస్థితి వస్తోందన్నది కూడా వాస్తవం. మరి దీని నుంచి ఏ మేరకు పాఠాలు నేర్చుకుంటారు. మోడీ చెప్పిన తర్వాత కూడా నాయకులు వినిపించుకోకపోవడాన్ని ఏ విధంగా చూడాలి? అనేది రాజకీయంగా బీజేపీని వెంటాడుతున్న ప్రశ్న.

# సునీల్ కుమార్ ను ఏం చేద్దాం? ప్రభుత్వంలో తర్జనభర్జన!



హైదరాబాద్,సీనియర్ ఐపీఎస్, డీజీ కేడర్ అధికారి సునీల్ కుమార్ విషయంలో ఏం నిర్ణయం తీసుకోవాలనే అంశంపై కూటమి ప్రభుత్వం తర్జనభర్జన పడుతోందని అంటున్నారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు ఫిర్యాదుతో సునీల్ కుమార్ పై హత్యాయత్నం కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో సోమవారం సునీల్ కుమార్ ను దర్యాప్తు అధికారి, విజయనగరం ఎస్పీ దామోదర్ సుమారు నాలుగు గంటల పాటు ప్రశ్నించారు. అనంతరం మరోసారి విచారణకు పిలుస్తామంటూ సునీల్ కుమార్ ను విడిచిపెట్టారు.డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు గతంలో ఎంపీగా ఉండగా ఆయనపై రాజద్రోహం కేసును నమోదు చేశారు. అప్పట్లో సీఐడీ చీఫ్ గా పనిచేసిన సునీల్ కుమార్ ఆదేశాలతో రఘురామపై కేసు నమోదు చేయగా, ఆయన పుట్టినరోజు నాడే హైదరాబాద్ లో అరెస్టు చేసి రాష్ట్రానికి తెచ్చారు. అరెస్టు చేసిన రోజు రాత్రి రఘురామపై కొందరు ముసుగువేసుకుని దాడి చేసినట్లు గత ఏడాది రఘురామరాజు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై సునీల్ కుమార్ తోసహా మరో ఐదుగురిని నిందితులుగా గుర్తిస్తూ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.నిందితుల్లో ముగ్గురు ఐపీఎస్ అధికారులు ఉండటంతో కేసు విచారణ బాధ్యతలను కూడా ఐపీఎస్ అధికారికి ప్రభుత్వం అప్పగించింది. ఈ పరిణామాల మధ్య సోమవారం సునీల్ కుమార్ విచారణకు హాజరయ్యారు. అయితే దర్యాప్తు అధికారి వేసిన ప్రశ్నలకు సునీల్ కుమార్ సరైన సమాధానాలు చెప్పలేదని ప్రచారం జరుగుతోంది. విచారణలో సంతృప్తికరమైన సమాధానాలు చెప్పకపోవడంతో సునీల్ కుమార్ ను అరెస్టు చేసి ప్రశ్నించాలని దర్యాప్తు అధికారి భావిస్తున్నట్లు చెబుతున్నారు.అయితే నిందితుడు సునీల్ కుమార్ సీనియర్ ఐపీఎస్ అధికారి కావడం, ఆయనను అరెస్టు చేయాలంటే ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాల్సివున్నందున.. దర్యాప్తు అధికారి సందిగ్ధంలో పడినట్లు ప్రచారం జరుగుతోంది. సునీల్ కుమార్ నుంచి నిజాలు చెప్పించాలంటే ఆయనను అరెస్టు చేయాలని చెబుతూ దర్యాప్తు అధికారి ప్రభుత్వానికి లేఖ రాసే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ప్రభుత్వం కూడా సునీల్ కుమార్ అరెస్టు చేయించడానికే మొగ్గు చూపుతోందని వ్యాఖ్యానిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తగిన సమయం కోసం ఎదురుచూస్తోందని అంటున్నారు.తనపై కస్టడీలో దాడి చేసిన వారిపై చర్యలకు రఘురామరాజు ఒత్తిడి చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ కేసులో ఏ4 రిటైర్డ్ ఏఎస్పీ విజయపాల్ ను గతంలో అరెస్టు చేశారు. ఆ తర్వాత ఆరోపణలు ఎదుర్కొంటున్నవారు కోర్టు ద్వారా రక్షణ పొందుతూ విచారణ ఎదుర్కొంటున్నారు. ఏ5 గుంటూరు జీజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ ప్రభావతి ఇదే మాదిరిగా అరెస్టు నుంచి తప్పించుకున్నారు. సుప్రీంకోర్టు ద్వారా విచారణకు నోటీసులు అందుకుని అరెస్టు ప్రమాదం నుంచి బయటపడ్డారు ప్రభావతి.అదేవిధంగా అప్పటి సీఐడీ ఎస్పీ సునీల్ నాయక్ సైతం కోర్టు ద్వారా

# మహాత్మా గాంధీ అంటే మోదీకి నచ్చదు...అందుకే పేరు మార్పు




హైదరాబాద్,మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరు మార్చడంపై దేశ వ్యాప్తంగా నిరసనలకు కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చాంది. డిసెంబర్ 17న అన్ని జిల్లా కేంద్రాలలో ధర్నా చేపట్టాలని ఆ పార్టీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌ఛార్జ్ కేసీ వేణుగోపాల్ తెలిపారు. డిసెంబర్ 28న భారత జాతీయ కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పార్టీ కార్యకర్తలు ప్రతి మండలం, గ్రామంలో గాంధీజీ చిత్రపటాలను పట్టుకుని నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.మహాత్మాగాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయ్‌మెంట్ గ్యారంటీ యాక్ట్ పేరు మార్చడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీకి గాంధీ ఆలోచనలు, పేదల హక్కులు రెండు నచ్చవని అందుకే ఈ పేరు మార్పు కార్యక్రమం అని విమర్శించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి మహాత్మాగాంధీ పేరును తొలగించడంపై పార్లమెంట్ ఆవరణలో కాంగ్రెస్ ఎంపీలు నిరసన తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రజలకు మంచి చేయాల్సిన అవసరం ఉందని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. 2005లో పథకాన్ని ప్రవేశపెట్టినపుడు అది కేవలం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మాత్రమే. 2009లో కాంగ్రెస్ రెండోసారి అధికారానికి వచ్చిన తర్వాత పథకంలో కొన్ని మార్పులు చేశారు. ఆ సందర్భంగానే మహాత్మాగాంధీ పేరును పథకానికి చేర్చారు.

## శ్రీవారి ఆలయంలో నేటినుంచి తిరుప్పావై సేవ

తిరుమల,ధనుర్మాసం సందర్భంగా తిరుమల శ్రీవారి అలయంలో సుప్రభాత సేవ బదులు తిరుప్పావై పాశురాలను ప్రవచిస్తారు. వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం నుంచి నెల రోజుల పాటు సుప్రభాత సేవ రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని భక్తులు గమనించాలని సూచించారు. ఈమేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మంగళవారం మధ్యాహ్నం 1:23 గంటలకు ధనుర్మాస ఘడియలు ప్రారంభం అవుతాయని వెల్లడించారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com